thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 149 | జగిత్యాల బుధవారం 02 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

టెన్నిస్ కోర్టే ఫ్యాషన్ ర్యాంప్



11

## కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ భేటీ

■ తాజా రాజకీయాలపై చర్చ 2



సింగరేణి బొగ్గు గనుల్లో ప్రైవేటు సంస్థల ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. భారీ నష్టాల్లో కొనసాగుతున్న భూగర్భ గనులను గని అభివృద్ధి, నిర్వహణ (ఎండీవో) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనలను సింగరేణి పరిశీలిస్తోంది. కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు నష్టాలను తగ్గించుకునే మార్గాల్లో భాగంగా ఈ దిశగా అడుగులు వేస్తోంది.



## ప్రళయం అంతులేని శోకం

ఇంకా వరదల్లో 275 మంది భారతీయులు

ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు



2

# సింగరేణిలో 'ప్రైవేటు' అడుగులు!

■ నష్టాల గనులను ఎండీవోకు ఇచ్చే యోచన
■ తొలుత శాంతిఖనితో ప్రయోగానికి సన్నాహాలు
■ 21 భూగర్భ గనుల్లో 1,924 కోట్లకు పైగా నష్టాలు
■ ఆడ్రియాలలో టన్నుకు రూ.27 వేలకుపైగా నష్టం
■ త్వరలో టెండర్లకు సింగరేణి కసరత్తు

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** సింగరేణి బొగ్గు గనుల్లో ప్రైవేటు సంస్థల ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. భారీ నష్టాల్లో కొనసాగుతున్న భూగర్భ గనులను గని అభివృద్ధి, నిర్వహణ (ఎండీవో) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనలను సింగరేణి పరిశీలిస్తోంది. కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు నష్టాలను తగ్గించుకునే మార్గాల్లో భాగంగా ఈ దిశగా అడుగులు వేస్తోంది. కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థల్లో ఎండీవో విధానాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో సింగరేణిలోనూ దీనిని ప్రయోగాత్మకంగా

మిగతా 2 లో

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు


2

అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు

ఈక్విటీ ఆధారంగా ఐదు కేటగిరీలు

రిస్క్ స్థాయిని బట్టి పథకాల వర్గీకరణ

ప్రభుత్వ ఖాతాలకు మినహాయింపు



## ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ

హైకమాండ్ నుంచి సురేఖకు పిలుపు..!
కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ చాన్స్!
రాజకీయ ప్రకంపనలు రేపుతున్న పరిణామాలు

2



## అదనపు సంచాలకుడిగా డీఎస్ జగన్

సమాచార శాఖలో పదోన్నతి

బాధ్యతలు స్వీకరించిన జగన్

అభినందించిన మంత్రి పొంగులేటి

సమన్వయంతో పని చేయాలని సూచన

2



# కంట తడి పెట్టుకుని.. కన్నవారి ఇంటికి.!







కట్టా నరేందర్,సీనియర్ జర్నలిస్ట్:పెద్దపల్లి



-కగార్ దాడితో సరెండర్,11 నెలలు పోలీసుల అదుపులో
-మాజీలకు మహారాష్ట్ర పోలీసులు కల్పించిన స్వేచ్ఛ
-సోనూ సహా మరో ఐదుగురు పోలీసుల వద్దనే.

సుదీర్ఘ కాలంగా అడవిబిడ్డల మధ్య తిరుగుతూ ఉండే మావోయిస్టులు ఆపరేషన్ కగార్ కేంద్రం తలపెట్టిన దాడితో వేల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు.ముఖ్య నాయకులంతా కన్ను మూశారు.మిగిలిన కొద్దిమంది మావోయిస్టు పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు వేణుగోపాల్ పిలుపుమేరకు అడవి బాట వీడి ప్రభుత్వానికి లొంగిపోయిన మావోయిస్టులంతా సోమవారం ఎవరి ఇంటికి వారు వెళ్లారు .గడ్చిరోలి లో మాజీ మావోయిస్టులు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని కంటతడి పెట్టుకున్నారు.11 నెలల పాటు మహారాష్ట్ర పోలీసులు అదుపులో ఉన్నారు .ప్రభుత్వం విధించిన గడువు ముగియడంతో సోమవారం గడిచిరోలి నుండి ఐదు జిల్లాలకు చెందిన మాజీ మావోయిస్టులు తమ సహచరులతో వీడ్కోలు పలికి సెలవు తీసుకున్నారు. సోను అలియాస్ వేణు వెంట 63 మంది మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎదుట లొంగిపోయింది విధితమే .ఆయుధాలు అప్పగించిన మావోయిస్టులు తమ సుదీర్ఘకాలకు సాయుధ పోరాటానికి విరమణ పలికారు .సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతామని లొంగుబాటు సమయంలో మల్లోజుల వేణుగోపాల్ ప్రకటించారు .ఆనాటి మాటకు కట్టుబడి తామంతా ప్రజల మధ్య వెళ్తామని ప్రజల సమస్యల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడుతామని పోలీసుల ఆధీనం నుండి ఇంటికి వెళుతున్న మాజీ మావోయిస్టులు మళ్లీ ప్రకటించారు.ఏడాది కాలం పాటు పోలీసుల చెరలో అంతకుముందు దశాబ్దాల కాలం పాటు దళములు కలిసి ఉన్న వారందరూ ...తమ తమ ఇళ్లలకు వెళుతున్న సమయంలో భావోద్వేగానికి గురై ఒకరినొకరు ఆలింగనం చేసుకుని కంటతడి పెట్టారు . విప్లవ రాజకీయాలలో వర్గ సంబంధము ఎంతో గొప్పదని తమకు నేర్పిన సిద్ధాంతం ను ఆశయాలను సాధించడానికి ప్రజాస్వామిక పద్ధతిని పాటిస్తామని చెప్పారు. ఇక తెలంగాణ ప్రాంతానికి చెందిన వేణుగోపాల్ సహా మోహన్ రెడ్డి, దీపిక ఇలా అయి ఐదుగురు తెలంగాణ పోలీసుల కోసం ,తెలంగాణ ప్రభుత్వ పిలుపు కోసం ఎదురుచూస్తున్నారు.



## కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ

**తాజా రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిమాణాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు, వారు ఇచ్చిన వివరణ తదితర అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ చర్చించినట్లు తెలుస్తోంది.

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు

**అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. ఎన్‌పీఎస్ పథకాల వర్గీకరణ, వాటి వివరాలను పెట్టుబడిదారులకు వెల్లడించే విధానంలో పెన్షన్ నియంత్రణ సంస్థ పీఎఫ్‌ఆర్‌డీఏ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ఈ మార్పులు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కొత్త విధానంలో ఎన్‌పీఎస్ పథకాలను వాటిలోని ఈక్విటీ పెట్టుబడి శాతం ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజించనున్నారు. తద్వారా పెట్టుబడిదారులు తమ రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా పథకాన్ని సులభంగా ఎంచుకునే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు. 80 నుంచి 100 శాతం వరకు ఈక్విటీ పెట్టుబడులు ఉండే పథకాలను 'కేటగిరీ-ఏ'గా వర్గీకరించి అత్యధిక రిస్క్‌తో కూడిన 'అగ్రెసివ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 60 నుంచి 80 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ--బీ'లోకి వస్తాయి. వీటిని అధిక రిస్క్ ఉన్న 'హై గ్రోత్' పథకాలుగా పేర్కొంటారు. 35 నుంచి 60 శాతం ఈక్విటీ ఉన్న పథకాలను 'కేటగిరీ-సీ'గా వర్గీకరించి 'బ్యాలెన్స్‌డ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 10 నుంచి 35 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-డీ'లోకి వస్తాయి. వీటిని తక్కువ రిస్క్‌కు ప్రాధాన్యమిచ్చే 'కన్జర్వేటివ్' పథకాలుగా పరిగణిస్తారు. సున్నా నుంచి 10 శాతం వరకు ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ-ఈ'లో ఉండి ప్రధానంగా రుణ ఆధారిత పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తాయి. ఒక పథకంలోని ఈక్విటీ పరిమితి రెండు కేటగిరీల్లోకి వచ్చేలా ఉండకూడదని కొత్త నిబంధనల్లో స్పష్టం చేశారు. ఎన్‌పీఎస్‌లో కొత్తగా చేరేవారికి మరో మార్పు అమల్లోకి రానుంది. అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రజెన్స్' ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచేవారి ఒక్కో పీఆర్‌ఏఎన్‌పై రూ.200 ఒకేసారి చెల్లించాల్సిన ఛార్జీ విధించనున్నారు. అయితే ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా నాలుగు త్రైమాసికాల్లో రూ.50 చొప్పున సంబంధిత యూనిట్లను రద్దు చేయడం ద్వారా వసూలు చేయనున్నారు. పెట్టుబడిదారులు పథకాన్ని ఎంచుకునే ముందు స్పష్టమైన సమాచారం పొందేలా కొత్త విధానాన్ని రూపొందించారు. ఇకపై పథకం పేరు, పెన్షన్ ఫండ్, ప్రారంభ తేదీ, గత రాబడులు, బెంచ్‌మార్క్, ఛార్జీలు, రిస్క్‌మీటర్, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాలను ఒకే విధానంలో ప్రదర్శించనున్నారు. దీంతో వివిధ పథకాల మధ్య తేడాలను సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు రిస్క్, రాబడులను పోల్చుకుని నిర్ణయం తీసుకునేందుకు చందాదారులకు అవకాశం లభించనుంది. అయితే కొత్త వర్గీకరణ ప్రభుత్వ రంగ ఎన్‌పీఎస్ ఖాతాలకు వర్తించదు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లపై స్టేఎత్తివేత

**సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు**

**హైదరాబాద్, సెప్టెంబర్1:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్‌చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు.. పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్ధిదారు కూడా కాదన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమన్నారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

**సింగిల్ జడ్జ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హై కోర్టు స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రంగనాథ్‌ని తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పునిచ్చారు. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి తీర్పుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు.

# సింగరేణిలో 'ప్రైవేటు' అడుగులు!

మొదటి పేజీ తరువాయి

చేపట్టాలని భావిస్తున్నారు. తొలుత మందమర్రి ప్రాంతంలోని శాంతిఖని భూగర్భ గనిని ఈ విధానంలో అప్పగించేందుకు ప్రైవేటు సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానించగా ఒక సంస్థ ముందుకొచ్చినట్లు సమాచారం. దీంతో త్వరలో టెండర్లు పిలిచేందుకు సింగరేణి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎండీవో విధానంలో గనిని ప్రైవేటు సంస్థకు అప్పగిస్తే.. సదరు సంస్థ తన సొంత ఖర్చుతో బొగ్గును వెలికితీసి ముందుగా నిర్ణయించిన ధరకు సింగరేణికి అందిస్తుంది. అనంతరం ఆ బొగ్గును సింగరేణి మార్కెట్‌లో విక్రయిస్తుంది. ప్రస్తుతం శాంతిఖని భూగర్భ గనిలో టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.21,558 వరకు వ్యయం అవుతుండగా.. విక్రయ ధర రూ.4,167 మాత్రమే ఉన్నట్లు సంస్థ లెక్కలు చెబుతున్నాయి. అంటే టన్నుకు రూ.17 వేలకుపైగా వ్యత్యాసం ఉంటోంది. ఎండీవో విధానంతో ఈ భారాన్ని తగ్గించుకోవచ్చని యాజమాన్యం భావిస్తోంది. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై భూగర్భ గనుల్లో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉద్యోగుల వేతనాలు, స్థిర, చర వ్యయాలను కలిపితే టన్ను బొగ్గు ఉత్పత్తికి అయ్యే ఖర్చుకు.. మార్కెట్‌లో దాని విక్రయ ధరకు భారీ వ్యత్యాసం ఉంటోంది. 2025 చివరి నాటికి సంస్థకు ఉన్న 22 భూగర్భ గనుల్లో 21 నష్టాల్లో ఉన్నట్లు కేంద్రానికి సమర్పించిన నివేదికలో సింగరేణి పేర్కొంది. ఈ గనుల ద్వారా రూ.1,924 కోట్లకు పైగా నష్టాలు వచ్చినట్లు వెల్లడించింది. ఆడ్రియాల భూగర్భ గనిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



అక్కడ టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.30,333 వరకు వ్యయం అవుతుండగా.. విక్రయ ధర రూ.2,492 మాత్రమే ఉన్నట్లు సంస్థ పేర్కొంది. దీంతో టన్నుకు రూ.27,841 మేర నష్టం వస్తోంది. ఈ ఒక్క గనిలోనే గతేడాది రూ.302.87 కోట్ల నష్టం నమోదైనట్లు తెలిపింది. సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఓపెన్‌కాస్ట్ గనులను నిర్వహిస్తోంది. ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలతో పెద్దఎత్తున బొగ్గు వెలికితీసే అవకాశం ఉండటంతో ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటోంది. దీంతో వాటి ద్వారా వచ్చే లాభాలతో భూగర్భ గనుల నష్టాలను కొంతవరకు పూడ్చుకుంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే నష్టాల్లో ఉన్న గనుల నిర్వహణను ఎండీవో విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదన ఇప్పుడు కీలకంగా మారింది. శాంతిఖనితో మొదలయ్యే ఈ ప్రయోగం విజయవంతమైతే మరిన్ని భూగర్భ గనులకూ ఇదే విధానాన్ని విస్తరిస్తారా? అన్నది సింగరేణి కార్మికవర్గాల్లో ఆసక్తికర చర్చగా మారనుంది.

# ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ



- హైకమాండ్ నుంచి సురేఖకు పిలుపు..!
- కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ చాన్స్!
- రాజకీయ ప్రకంపనలు రేపుతున్నపరిణామాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రి కొండా సురేఖ కు.. ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె హస్తినకు వెళ్లినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది. గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలే గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు.. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ అందించారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై కొండా సురేఖ వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా రెండు రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉంటే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన కొద్దిసేపటికే మంత్రి కొండా సురేఖ కూడా హస్తినకు చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలతో మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలుస్తుండటంతో కేబినెట్ విస్తరణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# ప్రళయం అంతులేని శోకం

**ఇంకా వరదల్లో 275 మంది భారతీయులు**

**ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 1:** నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో చెలరేగిన వినాశకర ప్రళయం అంతులేని శోకాన్ని మిగుల్చింది. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య వెయ్యి దాటగా.. 4,471 మంది ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. గల్లంతైన వారిలో కైలాస మానససరోవర యాత్రకు వెళ్లిన 275 మంది భారత పౌరులతో పాటు మరొక 128 మంది భారత సంతతి వ్యక్తులు ఉన్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. రోజురోజుకూ నదుల్లో మృతదేహాలు కొట్టుకొస్తుండటంతో నేపాల్ శవాగారాలన్నీ నిండిపోయి, మృతదేహాలను భద్రపరచడం, గుర్తించడం అధికారులకు అత్యంత సంక్లిష్టంగా మారింది. గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నేపాల్ ప్రభుత్వం బాధితుల వివరాలతో పవర్ పాయింట్ స్లైడ్‌షోలను కూడా సిద్ధం చేసింది. ఈ విపత్కర పరిస్థితిలో మృతుల కుటుంబాలకు సహాయం అందించేందుకు ఖాట్మాండులోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. నేపాల్ ప్రభుత్వం వెబ్‌సైట్‌లో విడుదల చేస్తున్న ఫోటోలు, వివరాల ద్వారా మృతదేహాలను గుర్తించిన పక్షంలో.. భౌతికకాయాలను స్వదేశానికి తరలించేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేస్తామని ఎంబసీ తెలిపింది. దీనికోసం నేపాల్ ప్రభుత్వం రూపొందించిన 9 అంచెల నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా మృతదేహ అవశేషాల డాక్యుమెంటేషన్, లభ్యమైన ఫోటోలు, వివరాలను నమోదు చేయాలి. అలాగే పోస్టుమార్టం నిర్వహణ, మరణానికి గల కారణాల నిర్ధారణ, అధికారికంగా వ్యక్తి గుర్తింపు, వేలిముద్రలు, డీఎన్ఏ, ఫోరెన్సిక్ శాంపిళ్ల సేకరణ, మృతుడి పాస్‌పోర్ట్ లేదా ఐడీ వెరిఫికేషన్, ఎంబసీ లేదా కాన్సులర్ సమన్వయ ప్రక్రియ పూర్తి, హ్యాండోవర్ మెమో, రసీదుల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మృతదేహాలు బాగా కుళ్లిపోయి, ఆకృతులు దెబ్బతినడంతో గుర్తింపు ప్రక్రియ కష్టసాధ్యంగా



మారింది. దీంతో నేపాల్ అధికారులు తాత్కాలిక పూడ్చివేతలను ప్రారంభించారు. ప్రతి శరీరానికి డీఎన్ఏ నమూనా తీసుకుని, ప్లాస్టిక్ బ్యాగ్‌లో ఉంచి ట్యాగ్, లోకేషన్ నంబర్‌ను కేటాయించి పూడ్చి పెడుతున్నారు. భవిష్యత్తులో డీఎన్ఏ మ్యాచ్ అయినప్పుడు కుటుంబ సభ్యులకు భౌతికకాయాల అవశేషాలను అప్పగించి తుది సంస్కారాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

# అదనపు సంచాలకుడిగా డీఎస్ జగన్

**సమాచార శాఖలో పదోన్నతి**

**బాధ్యతలు స్వీకరించిన జగన్**

**అభినందించిన మంత్రి పొంగులేటి**

**సమన్వయంతో పనిచేయాలని సూచన**

హైదరాబాద్, సెప్టెంబర్ 1: సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా డీఎస్ జగన్ పదోన్నతి పొందారు. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయాలని సూచించారు. ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుందరెడ్డిని జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన కూడా జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శాఖ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు చేపట్టిన జగన్‌కు శాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

- కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా
- ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు
- కష్టకాలంలో మేము మాత్రమే కేసీఆర్‌ను వెన్నంటి ఉన్నాం
- కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీ మంత్రి వేముల



**నిజామాబాద్, సెప్టెంబర్ 1:** కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురిని కలిసి రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌కు నమ్మకబంట్లుగా ఉన్న వారిని విడదీసి పార్టీని బలహీన పర్చాలన్న ఎజెండాతో కవిత పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. కవితను కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నం చేసిన, విడగొట్టడానికి ప్రయత్నం చేసిన విషయం కేసీఆర్‌కు బాగా తెలుసు. పార్టీ లైన్ దాటిన తర్వాత కేసీఆర్ కవితను పార్టీ నుంచి వేటు వేశారని అన్నారు. నేను, మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం. 2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు.. మధ్యలో పోయింద్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదు. కవిత కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం కవిత చేస్తున్నారు? స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని అన్నారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి, పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడంపై స్పందిస్తూ.. రాజకీయంగా సింపతిని గెయిన్ చేయడానికి అని అర్థం అవుతుంది. అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నాం. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయనపైన, కేటీఆర్‌పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కానీ బాధగా అనిపించింది. సొంత లాభం కోసం కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవితపై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రయోజనాలను సూచించే 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆ హామీలను అమలు చేస్తామని చెప్పిందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల ద్వారా ఎంత మేర బాకీ పడిందో ప్రజలకు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలను ఇకనైనా నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'బాకీ కార్డుల పూజ' కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

- 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
- నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
- సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రామ్మోహన్ నాయుడి హామీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. కేంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం తగదు

**ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదు**

**ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ నివేదికపై బండి**



**కరీంనగర్, సెప్టెంబర్ 1:** ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దుష్ప్రచారాలు తగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై బండి స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించు కోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు. 'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.



# మిర్యాలగూడ బీఆర్ఎస్ రైతుర్యాలీకి అనుమతి నిరాకరణ

**ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్న పోలీసులు**

**గ్రౌండ్ లేదా, హాలు లాంటి చోట్ల అయితే అభ్యంతరం లేదని వెల్లడి**

**నల్లగొండ, సెప్టెంబర్ 1:** మిర్యాలగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రైతు ర్యాలీ, బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను కారణంగా చూపుతూ కేటీఆర్ ర్యాలీ, మీటింగ్‌కు అనుమతి ఇవ్వలేమని తిరస్కరించారు. ఈనెల 3న మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు రైతు ర్యాలీ నిర్వహించడంతో పాటు రాజీవ్ చౌక్‌లో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ర్యాలీకి అనుమతి కోరుతూ బీఆర్ఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ రంగం, సాగునీరు, విద్యుత్, యూరియా కొరత, రైతు భరోసా తదితర రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దరఖాస్తులో పేర్కొన్నారు. దీనిపై మిర్యాలగూడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాజీవ్ చౌక్ ప్రధాన కూడలి కావడంతో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు తరలివస్తే అన్ని వైపుల నుంచి ట్రాఫిక్ నిలిచిపోయే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. రాజీవ్ చౌక్‌కు వచ్చే రహదారులు ఇరుకుగా ఉండటంతో పాటు ఈ ప్రాంతంలో రోజంతా భారీగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయని తెలిపారు. అక్కడ ట్రాఫిక్‌ను మళ్లించేందుకు తగిన ప్రత్యామ్నాయ మార్గాలు కూడా లేవని, వాహనాల పార్కింగ్‌కు సరిపడా స్థలం అందుబాటులో లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోడ్లపై వాహనాలను నిలిపితే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు కోదాడ-జడ్చర్లను కలిపే జాతీయ రహదారి-167 రాజీవ్ చౌక్ మీదుగా వెళ్తుందని పోలీసులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తే జాతీయ రహదారిపై కూడా రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజీవ్ చౌక్ పరిసరాల్లో పలు ప్రభుత్వ, ఇతర ముఖ్య కార్యాలయాలు ఉన్నందున బహిరంగ సభ వల్ల వాటి సాధారణ కార్యకలాపాలకు ఇబ్బంది కలగవచ్చని పోలీసులు తెలిపారు. ర్యాలీ, సభకు అనుమతి ఇస్తే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంటూ అనుమతిని తిరస్కరించారు. అయితే ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఇతర ప్రాంతాల్లో ఫంక్షన్ హాల్, గ్రౌండ్ వంటి ప్రదేశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం నిర్వహించు కునేందుకు అవకాశం కల్పిస్తామని పోలీసులు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# రాంచంద్రరావు హౌజ్ అరెస్ట్




**హైదరాబాద్,సెప్టెంబర్1 :** భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తార్నాకలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. భాజపా నల్గొండ జిల్లా అధ్యక్షుడి నివాసానికి వెళ్లనున్నట్టు ప్రకటించడంతో ఆయన్ను గృహనిర్బంధం చేసినట్టు పోలీసులు తెలిపారు. నల్గొండ జిల్లాలో భాజపా, కాంగ్రెస్ శ్రేణుల మధ్య పరస్పరం దాడులు జరిగాయి. నల్గొండలో మంత్రి కోమటి రెడ్డి కార్యాలయంపై భాజపా కార్యకర్తలు కోడిగుడ్ల దాడి చేయగా.. భాజపా నల్గొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశారు. దీంతో పట్టణంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో నల్లగొండ వెళ్లేందుకు రామచంద్రరావు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై బిజెపి శ్రేణులు మండిపడ్డాయి. అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరణ

**ప్రభుత్వ హామీతో సీజేపీ నిర్ణయం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన యాత్రను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సానుకూల హామీలు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మంగళవారం సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల కాలపరిమితిలోగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, జులై 20 నుంచి 25 మధ్య కాలంలో నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను తదుపరి విచారణకు తీసుకెళ్లబోమని, కొత్త కేసులు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. గతంలో సీజేపీకి ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ప్రభుత్వ హామీలపై సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ స్పందిస్తూ, "కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సానుకూల హామీలకు, వాటికి లభించిన న్యాయపరమైన భరోసాకు అనుగుణంగా సెప్టెంబర్ 5న తలపెట్టిన మార్చ్‌ను ఉపసంహరించుకోవడమే సముచితమని భావిస్తున్నాం. న్యాయస్థానం జారీ చేసిన తాజా ఉత్తర్వులకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. నీట్-యూజీ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో నిరసనకారులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని జులై 25న ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ సీజేపీ ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాగా, సీజేపీ తాజాగా తీసుకున్న నిరసన రద్దు నిర్ణయాన్ని జస్టిస్ సూర్యకాంత్ 'మంచి పరిణామం'గా అభివర్ణిస్తూ ప్రశంసించారు.

చురకలు





# భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

## రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్


**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్-400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్-400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్-400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్-400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్-400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం.. భారత్ మొత్తం 5 ఎస్-400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

# సికింద్రాబాద్ మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ

## కట్టుదిట్టమైన భద్రత ఉన్నా రైఫిళ్లు మాయమైనట్లు సమాచారం

## దర్యాప్తునకు రంగంలోకి దిగిన బొల్లారం పోలీసులు

**హైదరాబాద్,సెప్టెంబర్1:** సికింద్రాబాద్‌లోని మద్రాస్ రెజిమెంట్ ప్రాంతంలో అత్యాధునిక ఆయుధాలు మాయమవడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆర్మీ కాంపౌండ్‌లోకి చొరబడిన దుండగులు ఆయుధాలు భద్రపరిచే గదికి సంబంధించిన తాళాన్ని పగలగొట్టి 12 ఆయుధాలను అపహరించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆర్మీ అధికారులు బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. చోరీకి గురైన ఆయుధాల్లో నాలుగు ఏకే-47 రైఫిళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, ఆరు పిస్టళ్లు ఉన్నాయి. వీటితో పాటు పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి కూడా మాయమైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే రక్షణ వ్యవహారాలకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో పోలీసులు ఆయుధాల చోరీకి సంబంధించిన పూర్తి వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. మద్రాస్ రెజిమెంట్ ప్రాంతం చుట్టూ ఎత్తైన ప్రహరీతో పాటు మూడంచెల భద్రతా వ్యవస్థ కొనసాగుతోంది. రెజిమెంట్ ప్రాంతంలోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా అనుమతి తప్పనిసరి. ఆయుధాలు, మందుగుండు సామగ్రి భద్రపరిచే స్టోర్స్ చుట్టూ ప్రత్యేక భద్రత ఉంటుంది. అంతేకాకుండా అత్యాధునిక సీసీ కెమెరాలతో నిత్యం నిఘా కొనసాగుతుంది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత ఉన్న ప్రాంతంలోకి దుండగులు ఎలా ప్రవేశించారు.? ఆయుధాలు భద్రపరిచిన గది వరకు ఎలా చేరుకున్నారు.? తాళాన్ని ఎలా పగలగొట్టారు.? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు రెజిమెంట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రెజిమెంట్‌లోకి ఇటీవల ఎవరెవరు వచ్చారు.? ఎవరు బయటకు వెళ్లారు.? అనుమతులు ఎవరికి ఉన్నాయి.? అనే వివరాలను సేకరిస్తున్నారు. అలాగే అనుమానితులను కూడా పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఆయుధాల స్టోర్స్‌లో పనిచేసే సిబ్బంది, భద్రతా విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను కూడా క్షుణంగా పరిశీలిస్తున్నారు. చోరీకి గురైన ఆయుధాలు, మందుగుండు సామగ్రి పరిమాణం దృష్ట్యా ఈ ఘటనలో ఒకరి కంటే ఎక్కువ మంది వ్యక్తులు పాల్గొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నాలుగు ఏకే-47 రైఫిళ్లు, ఇన్సాస్ రైఫిల్, పిస్టళ్లు, మందుగుండు సామగ్రిని తీసుకెళ్లడానికి ఒకరి కంటే ఎక్కువ మంది వచ్చింటారని భావిస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు ఆయుధాలు నిజంగా చోరీకి గురయ్యాయా? లేక ఎక్కడైనా ఇతర ప్రాంతంలో ఉంచి, రికార్డుల్లో నమోదు కాకపోవడం వల్ల మిస్సింగ్‌గా గుర్తించారా..? అనే కోణంలోనూ అధికారులు పరిశీలిస్తున్నారు. ఆయుధాల స్టాక్, రికార్డులు, గతంలో జరిగిన ఆడిట్ వివరాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.






# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జీడీపీ వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తి సామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకు పోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

## తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు

## ఇప్పుడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్




**వాషింగ్టన్, సెప్టెంబర్ 1 :** అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పని చేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

# రష్యా సైన్యంలో 51మంది భారతీయులు మృతి

## విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** రష్యా సైన్యంలోని 51 మంది భారతీయులు మరణించారని విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. మొత్తం 227 మంది రష్యాలో సైన్యంలో చేరగా ఇప్పటివరకూ 139 మంది బయటకు వచ్చేశారని అన్నారు. మిగిలిన వారినీ వెనక్కు తీసుకొచ్చేందుకు రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ పర్యటన నేపథ్యంలో సోమవారం మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సెక్రటరీ ఈ వివరాలను వెల్లడించారు. ఈ అంశంలో రష్యాతో వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయని మిశ్రీ చెప్పారు. మాస్కోలోని భారతీయ ఎంబసీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భారతీయులను వెనక్కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతీయులు త్వరగా సైన్యం నుంచి డిశ్చార్జ్ అయ్యేలా రష్యా చర్చలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. రష్యా-భారత్ వాణిజ్యం గురించి కూడా మిశ్రీ మాట్లాడారు. గతేడాది భారత్‌లో రష్యన్ దిగుమతిదారుల సమావేశంలో అక్కడి సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. భారత్ నుంచి దిగుమతులను పెంచేందుకు ఉత్సుకత ప్రదర్శించాయని చెప్పారు. తదుపరి రష్యాలో జరుగనున్న సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరం సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సానుకూలంగా స్పందించారని అన్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఇటీవల కిర్గ్ రిపబ్లిక్ దేశ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా సమావేశం అయ్యారు. యుద్ధాలకు శాశ్వత ముగింపు పలికేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# విమానంలో సాంకేతిక లోపం

## అత్యవసరంగా గోవాలోనే ల్యాండింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్ట్ నుంచి విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన విమానం పైలట్ వెంటనే మనోహర్ ఎయిర్ పోర్ట్ అధికారులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈ విమానాన్ని అత్యవసరంగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ విమానంలోని ప్రయాణికులను ఢిల్లీ తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో యాజమాన్యం ఈ సందర్భంగా వెల్లడించింది. అందుకోసం మరో విమానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో తెలిపింది. విమానం టేకాఫ్ అయిన ఐదు నిమిషాలకే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు కనుగొన్నారని వివరించింది. విమానంలో ఏర్పడిన సమస్యను గుర్తించే పనిలో సాంకేతిక సిబ్బంది ఉన్నారని పేర్కొంది. ప్రయాణికులతోపాటు విమాన సిబ్బందికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఇండిగో సంస్థ తెలిపింది.

# జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ

## ధరలు మోత మోగిస్తుంటే..వృద్ధి ఎలా సాధ్యం

## ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ.850 నుంచి రూ.1,700కి, అల్యూమినియం ధర రూ.350 నుంచి రూ.650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ.50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్‌ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటిమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రతిధ్వనిస్తున్నారని విమర్శించారు. ఈ వృద్ధి



రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటుకు కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

# నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా గజ్వేల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలుర)లో మంగళవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెన్షన్ విధానంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసించారు. ఈ సందర్భంగా జీటీఏ సిద్దిపేట జిల్లా జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఫిట్‌మెంట్‌ను వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భూమయ్య, శ్రీనివాస్ గౌడ్, వాసుదేవరెడ్డి, పరశురాములు, రమేష్, ఫయాజ్, సందీప్, హరికృష్ణ, శ్రీకాంత్, రేష్మ, శ్యామల, స్వరూప రాణి, రూపా రాణి, అజిత విజయకుమారి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చుక్క శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**కొండపాక, సెప్టెంబర్ 01, :**
కొండపాక మండలంలోని దమ్మక్కపల్లి గ్రామానికి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి చుక్క శ్రీనివాస్ రెడ్డి తల్లి చుక్క రామలక్ష్మి మృతి చెందారు. విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి మంగళవారం దమ్మక్కపల్లి గ్రామానికి వెళ్లి చుక్క శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని, విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పంది రాజు, సీనియర్ నాయకులు సోలిపేట ప్రసాద్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మారెడ్డి, బండారు రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థులకు ఐడి కార్డ్స్ పంపిణీ

**సొంత నిధులుతో అందజేసిన మాజీ ఏఎంసి చైర్మన్ కొత్తూరి మహేష్**



**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్ 01, :**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని మోడల్ స్కూల్ లో చొప్పదండి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ తన సొంత ఖర్చులతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మోడల్ స్కూల్ లో విద్యార్థిని విద్యార్థులకు ఐడి కార్డ్స్ అందించి తధానంతరం కొత్తూరి మహేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే విద్యను విద్యార్థిని విద్యార్థులు ఏకాగ్రతతో అర్థం చేసుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, బాగా చదువు కొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, విద్యను బోధించిన ఉపాధ్యాయులకు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పాలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ బి. లావణ్య, అధ్యాపక బృందం, నాయకులు చింటూ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్



**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
జగిత్యాల రూరల్ మండలం తక్కలపల్లి గ్రామంలో మంగళవారం కసనబద గంగాధర్ దివ్యలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, సర్పంచ్, ఉప సర్పంచ్, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు రమణ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మహేష్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి

- **ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదు**
- **డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ**



**ఆసిఫాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
ఉత్తరాఖండ్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కుట్రపూరితంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జి అజ్మీరా శ్యాంనాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ దళితులు, బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని, అలాంటి నాయకుడిపై రాజకీయ కక్షతో కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా కేసులు పెట్టి గొంతు నొక్కాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభ అనంతరం అక్కడి బీజేపీ మద్దతుదారులు 'శుద్ధీకరణ' పేరుతో పూజలు నిర్వహించడం తీవ్రంగా అభ్యంతరకరమని సుగుణక్క అన్నారు. దళిత నాయకుడు పాల్గొన్న సభ అనంతరం శుద్ధీకరణ పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం అంటరానితనం భావజాలాన్ని ప్రోత్సహించడమేనని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని రాహుల్ గాంధీ ప్రశ్నించారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బీజేపీ ప్రభుత్వాల కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనమని ఆత్రం సుగుణ మండిపడ్డారు. దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడి గొంతును కేసులతో అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించు కోవాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు హర్షద్, పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కోఆర్డినేటర్ కోవా ఇందిరా, జిల్లా డీసీసీ కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం సభ్యులు, ఇందిరా ఫెలోషిప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి

- **ఉపాధ్యాయులకు కలెక్టర్ కట్టా హైమావతి సూచన**





**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీటీడీసీ భవన్‌లో మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను ఆమె సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 89,462 మంది విద్యార్థులను చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 82,489 మంది విద్యార్థులు చేరినట్లు తెలిపారు. నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా విద్యాబోధన అందిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతాయని కలెక్టర్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యాబుద్ధులు నేర్పాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం మరింత పెంచాలని, విద్యార్థుల ఆధార్ నమోదు ప్రక్రియను శనివారం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యతో పాటు విద్యార్థులకు నైతిక విలువలను కూడా బోధించాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయుల వద్ద చదువుకున్న విద్యార్థులు జీవితంలో ఎంతటి స్థాయికి ఎదిగినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోరని, అదే ఉపాధ్యాయులకు లభించే గొప్ప గౌరవమని అన్నారు. వివిధ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఒకటి, రెండు రోజుల సెలవులు వచ్చినప్పుడు ఇళ్లకు వెళ్లి తిరిగి సమయానికి వసతి గృహాలకు రావడం లేదని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, సెక్టోరల్ అధికారి రామస్వామి, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఒక్క పని చెప్పాలి

- **కేసీఆర్ చేసిన వెయ్యి పనులు మేము చెబుతాం**
- **బీఆర్ఎస్ నేతలు**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో సంపూర్ణంగా అమలు చేసిన ఒక్క పథకం లేదా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు మాత్రం వెయ్యి చెప్పగలమని బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ సందర్భంలో మాట్లాడినా కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్‌లను విమర్శించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని, అనంతరం రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపారని వారు పేర్కొన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుబంధు, 33 జిల్లాల ఏర్పాటు, జిల్లా స్థాయిలో సమీకృత కలెక్టరేట్‌ల నిర్మాణం, జిల్లాకో మెడికల్ కళాశాల వంటి కార్యక్రమాలను కేసీఆర్ హయాంలో చేపట్టినవేనని చెప్పారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు సరికావని వారు అన్నారు. రాజకీయ విమర్శలకు కూడా ఒక హద్దు ఉంటుందని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పనిచేసిన నాయకుడిపై ఈ విధంగా మాట్లాడటాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. "వెయ్యి రోజుల్లో మీరు చేసిన ఒక్క పని చెప్పండి, కేసీఆర్ చేసిన వెయ్యి పనులు మేము చెబుతాం" అని వారు సవాల్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలను విమర్శించడమే కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదేశాలతో సిద్దిపేట నియోజకవర్గంలో వారం రోజుల పాటు వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు రాధాకృష్ణ శర్మ, రాజనర్సు తెలిపారు. సెప్టెంబర్ 2న ఉదయం 9 గంటలకు ప్రతి గ్రామం, వార్డులో బాకీ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటలకు సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద ఆరు గ్యారంటీల అమలు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోని వైఫల్యాలపై 100 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 3న ఉదయం 9 గంటలకు పాత బస్టాండ్ వద్ద 22-ఏ నిషేధిత భూముల అంశంపై కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 4న మహిళలకు ఇస్తామన్న రూ.2,500, పెంచుతామన్న పింఛన్లు, కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల అంశాలపై సిద్దిపేట వెంకటేశ్వర దేవాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5న జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలుపై పాత బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 6న రైతులకు ఇచ్చిన హామీలు, సాగునీటి అంశాలపై రైతులతో కలిసి పాత బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించడంతో పాటు, సిద్దిపేట పట్టణంలో ఆటో కార్మికులతో భారీ ఆటో ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 7న అన్ని మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోహన్ లాల్, కుంబాల ఎల్లారెడ్డి, కాముని శ్రీనివాస్, ఎడ్ల సోమిరెడ్డి, లింగం గౌడ్, కోల రమేష్, కొనయ్యగారి ఎల్లయ్య, రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, అరవింద్ రెడ్డి, రెడ్డి ప్రభాకర్ రెడ్డి, కంతుల రమేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన

- **పారదర్శకంగా పరిశీలన పూర్తి చేయాలి**

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) రాజ గౌడ్**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
జగిత్యాల మండలం మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కింద వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి అందిన దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను సంబంధిత స్థలాల్లో పరిశీలించారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలు, స్థల పరిస్థితి, లేఅవుట్‌కు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వాస్తవ పరిస్థితులను పూర్తిగా నమోదు చేసి, అర్హత కలిగిన దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన వివరాలను టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి తదితర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అబ్కారి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవం

- ఈత మొక్కల ప్రాధాన్యతపై ఎక్సైజ్ అధికారుల అవగాహన
- గ్రామస్తులతో కలిసి ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు



**దమ్మపేట, సెప్టెంబర్ 01, :**
ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కోమల చెరువు కట్టపై మంగళవారం దమ్మపేట గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ హలవత్ బిచా నాయక్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక గీత కార్మికుల జీవనోపాధిని పెంపొందించే ఉద్దేశ్యంతో ప్రతీ సంవత్సరం తాటి, ఈత, ఖర్జూరం మొక్కలను వర్షకాలంలో నాటే కార్యక్రమం చేపడుతామని తెలియజేశారు. సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు మాట్లాడుతూ గీత కార్మికుల జీవన వృత్తి అయిన కల్లు తీసే చెట్లను పెంచి భవిష్యత్తులో గౌడ కుల వృత్తి నమ్ముకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా చెరువు కట్టలపై ఈత, తాటి చెట్ల వేళ్లు బలంగా పాతుకు పోవడం వలన చెరువు కట్టలు కోతకు గురికాకుండా బలంగా ఉంటాయి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పచ్చదనాన్ని పెంచే మొక్కలను సంరక్షించడం మన పర్యావరణానికి, మన మనుగడకు ఎంతో అవసరం అన్నారు. గ్రామస్తులు చిన్నశెట్టి యుగంధర్ మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సక్రమంగా సంరక్షించి, పెద్దవిగా పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలి అన్నారు, చెరువు కట్టపై మొక్కలు పెరగడానికి పొదలు, పిచ్చి మొక్కలను తొలగించాలి అని పంచాయతీ సిబ్బందికి, అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, పసుమర్తి కుసుమాంబ, రామభద్రం, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, మధు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, ధర్మసోతు నరేష్, అన్నవరపు నాగేంద్రరావు, పర్సా రామేశ్వరరావు, ఆబ్కారీ సిబ్బంది రాణా, పంచాయతీ సిబ్బంది వెంకటేష్, సింగ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అభయహస్తం రూ.12 లక్షలు 12 మందికైనా ఇచ్చారా

- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- అక్టోబర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహాదీక్ష
- అర్హులైన దళితులందరికీ వెంటనే రూ.12 లక్షలు ఇవ్వాలి
- వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
దళిత బంధు పథకానికి బదులుగా ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకం కింద అర్హులైన దళితులకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పటివరకు కనీసం 12 మందికైనా ఆర్థిక సహాయం అందించిందా అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రశ్నించారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. అర్హులైన దళితులందరికీ వెంటనే రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే ప్రభుత్వంపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ డిమాండ్ల సాధన కోసం అక్టోబర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహాదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. అసైన్డ్ భూముల హక్కులు కల్పించాలిఅసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని, గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న భూములను తిరిగి ఇప్పిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని వంగపల్లి డిమాండ్ చేశారు. ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి మాదిగ, మాల, ఇతర ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా దళితులకు రుణ సౌకర్యాలు సక్రమంగా అందడం లేదని అన్నారు. కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు ఎంతమంది దళితులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల పెంపు కోసం తీసుకున్న చర్యలను కూడా ప్రజలకు వివరించాలని కోరారు. విదేశీ విద్యపై వివరాలు వెల్లడించాలి అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారు, ఎంతమంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారో ప్రభుత్వం వెల్లడించాలని అన్నారు. రాజీవ్ యువ వికాసం అమలు చేయాలి దళిత యువతకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రకటించిన రాజీవ్ యువ వికాస పథకం అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వంగపల్లి శ్రీనివాస్ మాదిగ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కట్కూరి పరశురాములు, ఎర్ర ఎల్లం, నముండ్ల శ్రీకాంత్ రాజేందర్, గాజుల ముత్య, కర్రె మాణిక్యం, పోతురాజు శంకర్, బెజ్జంకి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




# పేదల పక్షపాతిగా వెయ్యి రోజుల పాలన

- జిల్లా పార్టీ కార్యాలయంలో వెయ్యి రోజుల ప్రజాపాలన సంబరాలు..

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
తెలంగాణ రాష్ట్ర ము సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయం మోతే రోడ్డులోజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య ఆధ్వర్యంలో వెయ్యి రోజుల ప్రజా పాలన సంబరాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి జగిత్యాల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ**

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మిస్తూ, సంక్షేమాన్ని విస్తరిస్తూ, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది అన్నారు.రైతులకు భరోసా, మహిళలకు సాధికారత యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ప్రపంచస్థాయి మౌలిక వసతుల నిర్మాణం, భారీ పెట్టుబడులకు ప్రోత్సాహం, భవిష్యత్తు తెలంగాణకు బలమైన పునాది వేస్తూ సంక్షేమం నుంచి అభివృద్ధి వరకు, ప్రజల ఆకాంక్షలను నిరంతరం నెరవేర్చడానికి 1000 రోజుల ప్రజాపాలన రాష్ట్ర ప్రగతిలో ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. సన్నబియ్యం, విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపు, 21వేల కోట్ల రుణమాఫీ, ఉచిత బస్సు, 9రోజుల్లో 9వేల కోట్ల రైతు భరోసా, 38వేల కోట్ల కాళేశ్వర ప్రాజెక్ట్ వడ్డీ చెల్లింపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, తెలంగాణ మోడల్ స్కూల్, విద్య, వైద్యం, ఏటీసీ సెంటర్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, ఇలా అనేక కార్యక్రమాలు అమలు చేయడం జరిగింది. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ నూతన సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని అప్పుల మయంగా గత ప్రభుత్వం మార్చినా వడ్డీ చెల్లిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారు. వెంటిలేటర్ పై ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఆక్సిజన్ లా రేవంత్ రెడ్డి పార్టీ నీ అధికారం లోకి తీసుకువచ్చారు. కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ముఖ్యమంత్రి సారథ్యంలో జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికీ నిరంతరం కృషి చేస్తా అన్నారు. వచ్చే ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడం తథ్యం అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేరింది. సీనియర్ నాయకులు పనిగట్టుకొని విమర్శించినా చంద్రబాబు, కేసీఆర్ రెండు పర్యాయాలు సీఎంగా అయ్యారని రేవంత్ రెడ్డి కూడా అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, అడువాల జ్యోతి లక్ష్మణ్, ఎన్నారై సెల్ చాంద్ పాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మన్సూర్, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్, సురేందర్ నాయక్, మాజీ ఏఎంసి చైర్మన్లు దామోదర్ రావు నక్కల రవీందర్ రెడ్డి, పట్టణ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, బాల ముకుందం, సీనియర్ నాయకులు గట్టు సతీష్, తాటిపర్తి శరత్ రెడ్డి, డీలర్ రవి, జిల్లా కాంగ్రెస్ వివిధ విభాగాల కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజల సహకారంతోనే పౌర సమస్యలకు శాశ్వత పరిష్కారం

- లెనిన్‌నగర్‌లో క్షేత్రస్థాయి పర్యటన.. పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారుల సమస్యలపై చింతల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆరా

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
ప్రజల సహకారంతోనే ఆయా డివిజన్ల పరిధిలో నెలకొన్న పౌర సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలమని చింతల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. మంగళవారం రోడామేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని లెనిన్‌నగర్‌లో స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు, బస్తీ వాసులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారులు తదితర పౌర సమస్యలను పరిశీలించారు. స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు, ప్రజలతో నేరుగా మాట్లాడి కాలనీలో ఉన్న సమస్యలు, ప్రజలకు అందుతున్న పౌర సేవల తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు డ్రైనేజీ లైన్ల మరమ్మతులకు సంబంధించిన సమస్యలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె.. సమస్యను సంబంధిత జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు చేపట్టేలా సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కాలనీలో మంజూరైన నూతన రహదారి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీలో ఫాగింగ్ నిర్వహించాలని స్థానికులు చేసిన విజ్ఞప్తిపై ఎంటమాలజీ సూపర్‌వైజర్‌కు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. శానిటేషన్ వాహనం క్రమం తప్పకుండా అందుబాటులో ఉంటుందా? ఇంటింటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందా? అనే అంశాలపై కూడా స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు "నో బిన్ – నో ట్రేడ్" కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని ఎస్ఎఫ్ఏ కృష్ణమూర్తి చారికి సూచించారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, పౌర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి సహకరించాలని ఆమె కోరారు.



# ప్రజా సైన్స్ ఉద్యమ బలోపేతానికి జెవివి మహాసభలు

## నేడు కుత్బుల్లాపూర్ మండల 6వ మహాసభలు – నూతన కమిటీ ఎన్నిక



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 01, :**
జన విజ్ఞాన వేదిక (జెవివి) కుత్బుల్లాపూర్ మండల 6వ మహాసభలను బుధవారం సాయంత్రం రోడామేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని పటేల్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు జెవివి మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ బురాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలో గతంలో నిర్వహించిన కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించడంతో పాటు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన మండల కమిటీ కార్యవర్గాన్ని ప్రతినిధుల సమక్షంలో ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల వరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు షేక్ బురాన్ వెల్లడించారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడం, మూఢనమ్మకాలను రూపుమాపడం, ప్రజా సైన్స్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని ఆయన అన్నారు. మండల పరిధిలోని జెవివి ప్రతినిధులు, కార్యకర్తలు, శాస్త్రాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# బీజేపీ కార్యాలయంపై దాడికి నిరసనగా సీఎం దిష్టిబొమ్మ దహనం

## షాపూర్ నగర్ చౌరస్తాలో బీజేపీ శ్రేణుల ఆందోళన



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
బీజేపీ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని నిరసిస్తూ మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం షాపూర్‌నగర్ చౌరస్తా పరిధిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అర్బన్ అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి బీజేపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పార్టీ కార్యాలయాలపై దాడులను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల కార్యాలయాలపై దాడులకు పాల్పడటం సరికాదని, ఇలాంటి ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు జె.కె. శేఖర్ యాదవ్, రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్ తదితర ముఖ్య నాయకులతో పాటు బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం

## దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 01, :**
దుబ్బాక మున్సిపాలిటీలోని వార్డుల్లో వేధిస్తున్న సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు, అందరి సహకారంతో మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని దుబ్బాక మున్సిపల్ చైర్పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్ అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపాలిటీ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన 40 ఎజెండా అంశాలను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపాలిటీలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు ఐదు లక్షలు, వార్డుల్లో నీటి పైప్లైన్, గేట్ వాల్ లీకేజీల పరిష్కారానికి 5 లక్షలు, నీటి ట్యాంకుల మరమ్మత్తులకు ఐదు లక్షలు, వార్డుల్లో, కూడళ్ల వద్ద వీధి దీపాల ఏర్పాటుకు 10 లక్షల ను ప్రభుత్వ నిధుల నుంచి ఖర్చు చేయుటకు ఆమోదం తెలిపారు. వార్డుల్లో మురుగు కాల్వలు, కల్వర్టుల మరమ్మత్తులకు 10 లక్షలు, వన మహోత్సవంలో మొక్కలు కొనుగోలు, నాటడం, వాటి సంరక్షణకు పది లక్షలు ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. డిఆర్సిసి, వర్మి కంపోస్ట్ షెడ్డు పెండింగ్ పనులు, సిసి రహదారి, విద్యుత్ పనులకు 10 లక్షలు, 12 వ వార్డులో ఎకరా విస్తీర్ణంలో నగరవాటిక ఏర్పాటుకు 6.16 లక్షల ఖర్చుకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఆస సులోచన, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, వార్డుల కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చురకలు
బుధవారం 02.09.2026

## చెక్కులతో మహిళలకు చేయూత..

- పనిముట్లతో వృత్తిదారులకు భరోసా
- ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కార్యక్రమంలో నర్సారెడ్డి భూపతిరెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంతో పాటు తుర్క కాషా ముస్లిం సోదరులకు పనిముట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మైనారిటీస్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డిలతో కలిసి మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన మైనారిటీ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అందజేయడంతో పాటు, తుర్క కాషా ముస్లిం సోదరులకు వారి వృత్తికి అవసరమైన పనిముట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం మైనారిటీ వర్గాల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఇటువంటి పథకాలు ఎంతగానో దోహదపడతాయని, వృత్తిదారులకు అవసరమైన పనిముట్లు అందించడం ద్వారా వారి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వారు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## 1000 రోజుల పరిపాలనలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా గజ్వేల్ ను గాలికి వదిలేసిన కేసీఆర్

- గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ జీతం తీసుకుని గజ్వేల్ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు
- అందుకే కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలి
- గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్
- గజ్వేల్ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ



**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి వెయ్యి రోజుల పరిపాలనలో ఘోరంగా విఫలమయ్యారని, గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న కేసీఆర్ వెయ్యి రోజులలో ఏనాడు గజ్వేల్ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని, అందుకోసమే కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షరెడ్డి, గజ్వేల్ మాజీ శాసనసభ్యులు తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ డీసీసీ ఉపాధ్యక్షులు మొనగారి రాజు, మాజీ కౌన్సిలర్ సమీర్, నక్క రేగొండ గౌడ్ లతో కలిసి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1000 రోజులలో అభివృద్ధి బాటలో పయనిస్తూ పేదల పక్షాన నిలబడి వివిధ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వెయ్యి రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అందజేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేసినటువంటివి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసాను కొనసాగిస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు, పేద కుటుంబాలకు సన్న బియ్యం, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుందని లబ్ధిదారుల పక్షాన ప్రభుత్వాన్ని అభినందించారు. ప్రతి పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్న ప్రజా ప్రభుత్వం, ఉచిత వైద్యం ఐదు లక్షల నుండి పది లక్షలు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకు దక్కడం అభినందనీయం అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సహకరించి పార్లమెంట్కు పంపిన ఘనత రేవంత్ రెడ్డిదని, బీసీ రిజర్వేషన్ల కొరకే బీసీ కులగన చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నారు. ఇలా ఎన్నో సంక్షేమ పథకాలకు పేద కుటుంబాలకు అందిస్తున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల హృదయాలలో నిలిచిపోయారని అన్నారు. కానీ ఈ 1000 రోజులలో గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కేసీఆర్ ఏ ఒక్క రోజు కూడా గజ్వేల్ నియోజకవర్గాన్ని పట్టించుకోక పోగా ఏ ఒక్కరోజు కూడా ప్రజల మధ్య లేరన్నారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకోకుండా ఈ వెయ్యి రోజుల్లో ఆయన జీతభత్యాలు సెక్యూరిటీ ప్రభుత్వ వసతులతో రూ.2 కోట్ల 24 లక్షల 40 వేలు తీసుకున్నాడని, గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సర్పంచులు ప్రతిరోజు ప్రజల్లో ఉండి పంచాయతీరాజ్ చట్టప్రకారంగా అభివృద్ధి చేస్తే వారికి బిల్లులు ఇవ్వక సర్పంచుల ఆత్మహత్యల కారణమైన కేసీఆర్, అలాగే ప్రాజెక్టుల పేరుతో వేల లక్షల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి తెలంగాణను విధ్వంసంలో నెట్టి , వేల కోట్ల అప్పులు చేస్తే వాటికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పులు తీర్చుకుంటా మిత్తిలు కట్టుతూ ప్రజా సంక్షేమ పాలనను వెయ్యి రోజుల నుండి కొనసాగిస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గతంలో దళిత సామాజిక వర్గానికి చెందిన తాటికొండ రాజయ్య లాంటి మరి కొందరి పని బాగా లేదని సస్పెన్షన్ చేసినటువంటి నీవు నీ పని ఇప్పుడు బాలేదని, అందుకే నీఅంతలా నీవు రాజీనామా చేసి ప్రభుత్వ సొమ్ము రూ.2,24,40,000 ను ప్రభుత్వానికి తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. నిన్ను సస్పెన్షన్ చేసే అంశం చట్టంలో లేదు గనక నీవే ఆత్మ పరిశీలన చేసుకుని నీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ నియోజకవర్గం ప్రజలను పట్టించుకుంటలేదని దానికి నిరసనగా గజ్వేల్ కేంద్రంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నక్క రాములు గౌడ్, నంగునూరి సత్యనారాయణ, జంగం రమేష్ గౌడ్, ఊడెం శ్రీనివాస్ రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, షరీఫ్, గుండు లక్ష్మణ్, జకీర్, జహీర్, జహంగీర్, సాయిలు, కొండల్ రెడ్డి, ఖాదర్, గాజుల శ్రీనివాస్, మున్నా, ప్రభాకర్, అరుణ్, రాములు, జిల్లా మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టు గిరిప్రదక్షిణ భక్తులకు ప్రసాదం పంపిణీ

- భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి
- సేవకుల విజ్ఞప్తి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో గిరిప్రదక్షిణకు వచ్చే భక్తుల కోసం ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గిరిప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని సేవకులు కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు గిరిప్రదక్షిణ మార్గంలో పలుచోట్ల గుంతలు ఏర్పడి భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గుంతలను మట్టితో పూడ్చి, రహదారిని సరిచేయడంతో పాటు మార్గంలో పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆలయ ఈవో,



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలను కోరారు. అలాగే గిరిప్రదక్షిణ మార్గంలో ఉన్న కోతులకు కూడా ప్రసాదం పంపిణీ చేశారు. గిరి పరిరక్షణలో భాగంగా చెట్లను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్యక్రమ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో సేవకులు ఆవుల లక్ష్మారెడ్డి, గూడ రాజు, ఎర్ర అనిల్ రెడ్డి, మంజూరు శ్రీనివాస్, లడ్డు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' ఫిర్యాదులు, అభ్యంతరాల గడువు మరో 15 రోజులు పెంచాలి

- నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు, వలస కార్మికులకు మరింత సమయం అవసరం
- పాలాస నరేందర్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'సర్' ప్రక్రియలో ఫిర్యాదులు, అభ్యంతరాలు, ఓటరు నమోదు స్వీకరణకు సెప్టెంబర్ 16 వరకు మాత్రమే గడువు విధించడంపై బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ ఇన్‌చార్జి పొలాస నరేందర్ స్పందించారు. ఈ గడువును మరో 15 రోజులు పొడిగించాలని మంగళవారం ఒక ప్రకటనలో ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేశారు. నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు, వలస కార్మికులు, డోర్‌లాక్ ఓటర్లు సాంకేతిక కారణాలతో లేదా నిర్ణీత గడువులోగా స్పందించలేకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. నోటీసుల్లోని వివరాలను అర్థం చేసుకోవడానికి పలువురు ఓటర్లు విద్యావంతుల సహాయం తీసుకోవాల్సి



వస్తోందని తెలిపారు. సర్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, పటిష్టంగా పూర్తి చేయడానికి ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణకు అదనంగా 15 రోజుల సమయం ఇవ్వాలని కోరారు. ఏ కారణంతోనూ అర్హులైన ఒక్క ఓటరు కూడా తమ ప్రాథమిక ఓటు హక్కును కోల్పోకూడదని అన్నారు. ఓటు కేవలం హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో మన భవిష్యత్తును నిర్ణయించే శక్తివంతమైన ఆయుధమని పొలాస నరేందర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందడంతో పాటు దానిని సద్వినియోగం చేసుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

## సీఎం దృష్టికి లీడ్ క్యాప్ భూసమస్య

- యూనిక్ మాల్ లో 50 శాతం వాటా
- న్యాయం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం
- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి
- త్వరలోనే ప్రతినిధి బృందంతో సీఎంను కలుస్తామని వెల్లడి





**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 01, :** లీడ్ క్యాప్ భూముల వ్యవహారంలో మాదిగలకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషి చేస్తానని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. మాదిగలకు చెందిన భూముల పరిరక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్లోని గచ్చిబౌలిలో ఉన్న లీడ్ క్యాప్ భూములను ప్రొఫెసర్ కాశీం, లీడ్ క్యాప్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి డాక్టర్ కవ్వంపల్లి పరిశీలించారు.

**ఈ సందర్బంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ**

మాదిగల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పథంతో పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన కుల గణన ద్వారా సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమైందని ఆయన పేర్కొన్నారు. లీడ్ క్యాప్ భూముల విషయంలోనూ ముఖ్యమంత్రి న్యాయం చేస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. పది మంది ప్రతినిధులతో సీఎంను కలుస్తామని, ఢిల్లీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన అనంతరం లీడ్ క్యాప్ సమస్యలపై పది మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పూర్తి వివరాలను నివేదిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం లీడ్ క్యాప్ అసోసియేషన్ తరఫున పది మంది ప్రతినిధులను ఎంపిక చేయాలని ఆయన సూచించారు. లీడ్ క్యాప్ భూములను లీజుకు తీసుకున్న యునిక్ మాల్ కంపెనీ చేపట్టిన నిర్మాణాల్లో 50 శాతం వాటా లీడ్ క్యాప్ కు దక్కేలా ముఖ్యమంత్రిని కోరుతామని కవ్వంపల్లి తెలిపారు. లీడ్ క్యాపు న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ**

ఎస్సీల సంక్షేమానికి వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో రూ. 500 కోట్లు కేటాయించాలన్నారు. ఈలోగా 200 కోట్లు విడుదల చేయాలని కోరారు. మాల, మాదిగలకు చెందిన భూములను లాక్కోవడం పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. పార్కులు, ప్రాంగణాలు, రైతు వేదికలు, వైకుంఠ ధామాల నిర్మాణాలకు ప్రభుత్వం ఎస్సీల భూములనే లాక్కుంటున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. దుద్దెడ ప్రాంతంలోగల లిడ్ క్యాప్ భూముల్లోనే కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాలు నిర్మించారని ఆయన గుర్తు చేశారు. పెట్రోల్ బంక్ కోసం ఇచ్చిన ఇతరులకు ఇచ్చిన లీజ్ ను వెంటనే రద్దు చేయాలని ఆయన కోరారు. లీడ్ క్యాప్ భూముల పరిరక్షణతోపాటు చర్మ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిశ్రమని అభివృద్ధి పరిస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గురుకులాల విద్యార్థులకు, ఆర్టీసీ, సింగరేణి కార్మికులకు, పోలీసుశాఖలో పని చేస్తున్న వారందరికీ షూలు తయారు చేసే ఇవ్వవచ్చని, దీని ద్వారా పరిశ్రమ అభివృద్ధితోపాటు ఎందరికో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయన్నారు. లీడ్ క్యాప్ కళాకారుల యూనియన్ చైర్మన్ ఆరెపల్లి రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్పొరేషన్ ఎండీ ప్రశాంత్, మేనేజర్ యాదయ్య, యూనియన్ నాయకులు పల్లెర్ల వీరస్వామి, రాంబాబు, నర్సింహ, ఓం ప్రకాష్, సతీష్, జాన్ దర్శనం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ హామీ ఇచ్చారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల్లో జాప్యం కారణంగా విద్యార్థులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఏబీవీపీ ప్రతినిధులు మంగళవారం చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని




ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే బకాయిలను విడుదల చేయాలని ఏబీవీపీ ప్రతినిధులు కోరారు.

# వనమహోత్సవం పనులు వంద శాతం పూర్తి చేయాలి

- జలసిరి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి




**సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 01, :** వనమహోత్సవం, జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు, వీవీజీ రామ్‌జీ తదితర అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి ఆయా కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.

### 83 శాతం పూర్తయిన వనమహోత్సవం

జిల్లాలో వనమహోత్సవం కింద 17.60 లక్షల మొక్కలు నాటే లక్ష్యానికి గాను ఇప్పటివరకు 14.63 లక్షల మొక్కలు నాటినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేసి వంద శాతం మొక్కలు నాటాలని ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కకు తప్పనిసరిగా జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని ఎంపీడీవోలను సూచించారు. జలసిరి పనుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్ని మండలాల్లో పనులు ఆశించిన స్థాయిలో జరగకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఫాంపాండ్ల నిర్మాణానికి అర్హులైన రైతులను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలకు అనువైన బోర్లను గుర్తించి రైతులతో మాట్లాడాలని తెలిపారు. అలాగే రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఇంకుడుగుంతలు, సామూహిక ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ భవనాలను గుర్తించి అంచనాలు రూపొందించి రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పనులు చేపట్టాలని ఏపీవోలను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో రూఫ్ లెవల్‌కు చేరినవి, చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలిన ఇళ్లను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇంకా మార్క్‌అవుట్, గ్రౌండింగ్ జరగని ఇళ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. నిర్మాణాల్లో జాప్యం చేస్తున్న లబ్ధిదారులతో స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో చర్చించి పనులు పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీవోలకు సూచించారు. రెండో విడతలో మంజూరైన ఇళ్ల లబ్ధిదారుల వివరాలపై క్షేత్రస్థాయి గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### వీవీజీ రామ్‌జీ పనులు ప్రారంభించాలి

వీవీజీ రామ్‌జీ కార్యక్రమంలో భాగంగా మండలాల వారీగా గ్రామాల్లో మంజూరైన అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, స్వయం సహాయక సంఘాల భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు ప్రారంభం కాని చోట్ల గ్రామ సర్పంచ్, పాలకవర్గంతో సమావేశాలు నిర్వహించి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న భవనాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. చేయూత పెన్షన్లపై ప్రత్యేక దృష్టి చేయూత పెన్షన్లకు సంబంధించి డెత్ మార్కింగ్, ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసి సంబంధిత రికార్డులను క్లోజ్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీఆర్డీఓ రమేష్, డీపీఓ రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ, హౌసింగ్ పీడీ భగవంత్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.



# శ్రీవారి దర్శనంతో మానసిక ప్రశాంతత

- రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 1, :** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనంతో మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక ఆనందం లభిస్తాయని రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్ మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ–ఐలయ్య గౌడ్ దంపతుల కుమార్తె, న్యాయవాది సాయి పూజ గౌడ్‌కు సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన ఉపాధ్యాయులు బురుగు సత్యనారాయణ–పద్మ గౌడ్ దంపతుల ప్రథమ కుమారుడు రోహిత్ గౌడ్‌తో ఆగస్టు 16న వివాహం జరిగింది. వివాహానంతరం నూతన దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల తిరుపతి దేవస్థానానికి చేరుకుని శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఆరాధించే కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల మన తెలుగు రాష్ట్రాల్లో ఉండటం తెలుగు ప్రజల అదృష్టమన్నారు. శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలనలో ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందాలని, సమర్థవంతమైన పరిపాలన కొనసాగాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి యువసేన నాయకులు గూడ సాయిప్రవీణ్ గౌడ్‌తో పాటు ఇరు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.



# సీ.సీ కెమెరాల ఏర్పాట్లను పర్యవేక్షించిన సీ.ఐ నాగరాజు

- సీ.సీ కెమెరాలతో నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన భద్రత - ఎస్.ఐ రాజేష్



**దమ్మపేట, సెప్టెంబర్ 01, :** దమ్మపేట మండల కేంద్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం కొరకు సీ.సీ కెమెరాల ఏర్పాటు సి.ఐ నాగరాజు, ఎస్.ఐ రాజేష్ సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు ను సీసీ కెమెరాల ఏర్పాటుకు పంచాయతీ నిధులు సమకూర్చాలి అని తెలియచేయగా మంగళవారం జరుగుతున్న సీసీ కెమెరా ఏర్పాట్లను స్వయంగా వచ్చి క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులు పరిశీలన చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, రాత్రి వేళల్లో కూడా స్పష్టంగా రికార్డు చేసే నైట్ విజన్ మరియు అధునాతన కెమెరాలను ఏర్పాటు చేయాలని టెక్నీషియన్ శ్రీరాముల శరత్ ని ఆదేశించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు గ్రామస్తులు సీ.సీ కెమెరాలను దొంగలు, ఆకతాయిలు ధ్వంసం చేయకుండా కాపాడుకోవాలని సూచించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు రావాలి అని, దాతలు ఎవరైనా ఉంటే తమకు తెలియచేయాలి అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, మార్గాలలో మొదలు, చివర కెమెరాల ఏర్పాటు ఉండాలి అన్నారు. వ్యాపారులకు సీసీ కెమెరాల ప్రాధాన్యత పై అవగాహన కల్పించారు. నేరగాళ్లలో భయం ఏర్పడి దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు తగ్గుతాయి అన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన లేదా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు, నిందితులను గుర్తించడానికి రికార్డు అయిన ఫుటేజ్ లు కీలక ఆధారాలుగా ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి గ్రామస్తులు అత్తిలి శ్రీనివాసరావు, చిన్నశెట్టి ముక్తేశ్వరరావు, గవర రాంబాబు, సున్నం శ్రీనివాసరావు, సంకు రమేష్, ముక్కు శ్రీరామమూర్తి తదితరులు ఉన్నారు.

# యువ చైతన్య దీపం ఫౌండేషన్‌కు శ్రీకృష్ణ యాదవ సంఘం రూ.5 వేల విరాళం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం నిమ్మపల్లి (గొల్లపల్లి) గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం యువ చైతన్య దీపం ఫౌండేషన్ ఆశ్రమానికి రూ.5 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులకు యువ చైతన్య దీపం ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పరిచయం చేశారు. విరాళం అందజేసే కార్యక్రమంలో ముఖ్యపాత్ర పోషించిన ఫౌండేషన్ కొనరావుపేట మండల అధ్యక్షులు షేక్ నజీర్‌కు, గొల్లపల్లి శ్రీకృష్ణ యాదవ సంఘం పెద్దలకు, సంఘ సభ్యులందరికీ ఫౌండేషన్ తరపున శేఖర్ సేనాపతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గత జూలై నెలలో వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి రోడ్, హన్మక్కపల్లిలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి దిక్కూ మొక్కూ లేని వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నామని తెలిపారు. తమ సేవా సంకల్పానికి వేములవాడ నియోజకవర్గం లోని వివిధ మండలాలు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన సామాజిక సంఘాలు అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు భవిష్యత్తులోనూ ప్రజలు, సామాజిక సంఘాలు తమ సహకారాన్ని అందించాలని శేఖర్ సేనాపతి కోరారు. శ్రీకృష్ణ యాదవ సంఘం అందించిన రూ.5 వేల విరాళం ఆశ్రమంలోని వృద్ధుల సేవలకు ఉపయోగపడుతుందని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

# మహాదేవపురం రెవెన్యూ సమస్యకు త్వరలో పరిష్కారం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించిన కాలనీ వాసులు – కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** మహాదేవపురం కాలనీ వాసులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. మహాదేవపురం కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులతో కలిసి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలను హనుమంత్‌రెడ్డి, మహాదేవపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి మహాదేవపురం రెవెన్యూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కాలనీ వాసుల సమస్యను సానుకూలంగా పరిగణించిన మంత్రి వెంటనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి మహాదేవపురం రెవెన్యూ సమస్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇవ్వడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారానికి స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, కొలను హనుమంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కాలనీ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం


- సమావేశంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సంగారెడ్డి నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీల అమలు ఏమైందని, హామీలు ఏమయ్యాయి అని వాటిపై ప్రశ్నించేందుకు ధర్నా కార్యక్రమం రెండవ తేదీన బుధవారం జరుగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు ఉద్యమ పిలుపు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలులో వైఫల్యాలకు నిరసనగా ధర్నా కార్యక్రమం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలియజేశారు. రెండవ తేదీన గలమెత్తి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భారీ ర్యాలీతో ధర్నా జరుగుతుందని తెలిపారు. ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన బిఆర్ఎస్ శ్రేణులు అందరూ హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరణానంతరం నేత్రదానానికి ముందుకు రావాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** మరణానంతరం నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న 15 రోజుల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ నేత్రదానంపై రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కంటి దానం మహాదానం అని, మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులతో చర్చించి, మరణానంతరం నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నేత్రదానం ప్రాముఖ్యత, నేత్రదానానికి సంబంధించిన విధానాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను నేత్రదాన ఉద్యమంలో భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. నేత్రదానం చేయాలనుకునే వారు మరణించిన ఆరు గంటలలోపు సంబంధిత నేత్రదాన కేంద్రం ఫోన్ నెంబర్ 9849545822 శ్రీనివాస్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. దీంతో వారు కంటి రెటిన సేకరించి ఐ బ్యాంక్ కి పంపిస్తామని అధికారులు తెలిపారు. ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరికి చూపు ప్రసాదించే అవకాశం ఉన్నందున, ప్రజలు ఈ మహత్తర కార్యక్రమానికి సహకరించాలని కోరారు.కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ సుభాషిణి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాగేందర్ బాబు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అంధత్వ నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ నయీమ్‌జహా తదితరులు పాల్గొన్నారు.

చురకలు బుధవారం 02.09.2026

## వేములవాడ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకుముందు భీమేశ్వర వసతి గృహం వద్దకు చేరుకున్న చైర్మన్ బక్కి వెంకటయ్యకు పోలీసు సిబ్బంది గార్డ్ ఆఫ్ ఆనర్‌తో గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న చైర్మన్, కమిషన్ సభ్యులకు ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు చైర్మన్, సభ్యులకు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్ కుమార్ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేసి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ వీర ప్రసాద్, పీఆర్వో పెరుక శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు రాజేందర్, నరేందర్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, పోలీసు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఐఅండ్ పీఆర్ జేడీ జగన్ కు అడిషనల్ డైరెక్టర్గా పదోన్నతి

- అభినందనలు తెలియజేసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 01, :** రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్గా పదోన్నతి పొందిన జాయింట్ డైరెక్టర్ డిఎస్ జగన్ కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అభినందనలు తెలియజేశారు. మంగళవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులతో కలిసి మాసబ్ ట్యాంక్ లోని సమాచార భవన్ (ఐఅండ్ పీఆర్ కార్యాలయం)లో జగన్ ను కలిసి పూలబోకే అందజేసి అభినందనలు తెలియజేశారు. సోమయ్యతో పాటు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె పాండురంగారావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి రవికుమార్, రంగారెడ్డి జిల్లా నాయకులు నంబి పర్వతాలు, గోవింద్ నాయక్, ఎం రవికుమార్ తదితరులు నూతన అడిషనల్ డైరెక్టర్ జగన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన డిఎస్ జగన్ కు డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి లభించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఈ సందర్భంగా జగన్ దృష్టికి తీసుకువెళ్ళి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

## పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలి

- ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఫౌండేషన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని
- బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు కష్టపడి చదువుతూ పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించగలరని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్, ఇతర సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, పోలీస్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించి ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి పోటీ పరీక్షకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారని, అందువల్ల పోటీని చూసి నిరుత్సాహ పడకుండా వంద శాతం శ్రమ, ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. పోటీ పరీక్షలకు అవసరమైన నాలెడ్జ్‌ను పెంపొందించుకోవడంతో పాటు ప్రతిరోజూ నిర్ణీత సమయాన్ని కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని అన్నారు.మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం సాధించడం సాధ్యమే అని కలెక్టర్ విద్యార్థులకు ఉద్బోధించారు. జీవితంలో ప్రతి రంగంలోనూ సమస్యలు, సవాళ్లు ఉంటాయని, వాటిని అధిగమించే మన దృక్పథంపైనే వాటి ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలను చూసి వెనుకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలుచుకుని ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే వరకు నిరంతరంగా కృషి చేయాలని, విజయం సాధించాలనే నమ్మకంతో ముందుకు సాగాలని అన్నారు. అనంతరం కలెక్టర్ బీసీ స్టడీ సర్కిల్‌లోని క్లాస్‌రూమ్‌లు, స్టడీ మెటీరియల్, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అధ్యయన వాతావరణాన్ని పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా చూడాలని, అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని, స్టడీ సర్కిల్‌లోని సదుపాయాలను మరింత మెరుగుపరచాలని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్షల విధానం, సిలబస్, ప్రాథమిక అంశాలు, సాధారణ అవగాహన తదితర అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం లభించనుందని బిసి సంక్షేమ అధికారి జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సిద్దిపేట ఆధ్వర్యంలో 31 రోజుల పాటు నిర్వహించనున్న మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ రమేశ్ హాజరై శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువత, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమ నైపుణ్యాలను పెంపొందించుకుని చిన్న తరహా స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం, బ్యాంకులు, శిక్షణ సంస్థలు అందిస్తున్న పథకాలు, రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని శిక్షణ అనంతరం ఉపాధి ప్రారంభించాలని సూచించారు. మహిళలు టైలరింగ్ నైపుణ్యంతో ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఆర్ఎస్ఈటీఐ ద్వారా టైలరింగ్‌తో పాటు వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, బ్యాంకింగ్, ఆర్థిక నిర్వహణపై కూడా శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి స్వయం ఉపాధి ప్రారంభించేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తామని పేర్కొన్నారు. త్వరలో మగ్గం వర్క్స్, పాడి పశువుల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం తదితర ఉపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించ



నున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత, మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడమే ఆర్ఎస్ఈటీఐ ప్రధాన లక్ష్యమని సంస్థ డైరెక్టర్ గేము నాయక్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఏ అధికారి సుధీర్, ఆర్ఎస్ఈటీఐ సిబ్బంది నజీమ్, నాగరాజు, స్వప్న, ప్రశాంత్, శిక్షణార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా కోటి దీపోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

- నవంబర్ 12 నుంచి 20 వరకు ఆధ్యాత్మిక వైభవంతో కోటి దీపోత్సవ వేడుకలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** శ్రీ శ్రీ శ్రీ నకులేశ్వరి దేవి సిద్ధిపీఠం ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది నిర్వహిస్తున్న పవిత్ర కోటి దీపోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. గాజులరామారంలోని శ్రీ చిత్తారమ్మ తల్లి దేవాలయంలో గ్రామ పెద్దలు, ముఖ్య అతిథులు, వివిధ పార్టీల నాయకులు, భక్తుల సమక్షంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ నకులేశ్వరి దేవి సిద్ధిపీఠం ఫౌండర్ అండ్ చైర్మన్ తిరునగరి నరేంద్ర ఆచార్యులు నందు స్వామి, అధ్యక్షులు కజ్జపు అఖిలేశ్వర శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మోహనాచార్యులు, శివశ్రీ వీరేందర్ స్వామి, కోశాధికారి జీవనిగే రవితేజ శర్మ, జాయింట్ సెక్రటరీ చాతం లలిత్ రాజ్తో పాటు శ్రీ నకులేశ్వరి దేవి సిద్ధిపీఠం నక్షత్ర వనాలయం ట్రస్ట్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కార్తీక మాసంలో నిర్వహించే కోటి దీపోత్సవం అత్యంత పవిత్రమైన, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని తెలిపారు. లోకకళ్యాణం, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమాజ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ భక్తుల సహాయ సహకారాలతో ప్రతీ సంవత్సరం ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2026 నవంబర్ 12 నుంచి 20వ తేదీ వరకు కోటి దీపోత్సవానికి సంబంధించిన వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా అందరి సమన్వయంతో, భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించాలని వివిధ పార్టీల నాయకులు ఆకాంక్షించారు. కోటి దీపోత్సవ వేడుకలకు భక్తులు, గ్రామ ప్రజలు, ఆధ్యాత్మిక అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించారు.

# ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

- మానవీయ కోణంలో సేవలు అందించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై అధికారులతో సమీక్ష

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 01, :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు సమన్వయంతో పనిచేసి, వారికి ప్రభుత్వ పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. ప్రజలకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మానవీయ కోణంలో సేవలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె వారికి స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.అనంతరం కలెక్టర్, ఎస్పీ, కమిషన్ సభ్యుడితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, ప్రభుత్వ పథకాల అమలు, సంక్షేమ కార్యక్రమాలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు.

### అర్హులందరికీ పథకాల ఫలాలు అందాలి

ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అట్రాసిటీ కేసుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్య, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, జాబ్ కార్డులు కలిగిన ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై సమీక్షించారు.జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలు, ఛార్జిషీట్ దాఖలు పరిస్థితిని తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అందించాల్సిన నష్టపరిహారం సకాలంలో అందేలా చూడాలని సూచించారు. ప్రతి నెల చివరి వారంలో మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొని ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు పెండింగ్‌లో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విడుదలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాలు తెరిపించాలని సూచించారు. తద్వారా వారికి బ్యాంకు ద్వారా బీమా సౌకర్యం అందే అవకాశం ఉంటుందని తెలిపారు.

### కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు అభినందనలు

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సేవలను చైర్మన్ బక్కి వెంకటయ్య అభినందించారు. కలెక్టర్ అందరికీ సమానంగా న్యాయం చేస్తూ విద్యార్థులు, ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీసు, ఇతర శాఖల అధికారులు అందిస్తున్న సేవలను కూడా ఆయన అభినందించారు.

### విద్యార్థులకు నాణ్యమైన భోజనం

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎస్సీ, ఎస్టీలకు క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ ప్రతిరోజూ కామన్ మెనూ అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యాలయాల్లో ప్రత్యేక అధికారులను నియమించి తనిఖీలు నిర్వహిస్తున్నామని, అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార



వేతనాలు, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వంటి ప్రయోజనాలు అందిస్తున్నట్లు వివరించారు.

### 32 అట్రాసిటీ కేసులు నమోదు

జిల్లా ఎస్పీ మహేష్ బి గితె మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్‌కు వివరించారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేస్తున్నామని, వివిధ దశల్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దర్యాప్తు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం ఎస్‌డీఎఫ్ కింద ఎస్సీలకు 169 పనులకు రూ.4.29 కోట్లు, ఎస్టీలకు 38 పనులకు రూ.89 లక్షలు మంజూరయ్యాయి. ఈ ఏడాది జిల్లాలో 32 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనట్లు పోలీసు అధికారులు తెలిపారు.

### ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వివిధ సౌకర్యాలు

జిల్లాలో 9 ఎస్సీ ప్రీ–మెట్రిక్ హాస్టళ్లలో 337 మంది బాలురు, 80 మంది బాలికలు, మూడు పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో 106 మంది బాలురు, 179 మంది బాలికలు చదువుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సులో 97 మంది అభ్యర్థులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం డైట్ చార్జీలను 3 నుంచి 7వ తరగతి వరకు రూ.1,330, 8 నుంచి 10వ తరగతి వరకు రూ.1,540, ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.2,100కు పెంచిందని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. కాస్మొటిక్ చార్జీలు కూడా దాదాపు మూడు రెట్లు పెంచినట్లు పేర్కొన్నారు. ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో కలిపి 85 మంది బాలురు, 63 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. టీజీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని పాఠశాలలు, కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో కలిపి 3,527 మంది ఎస్సీ విద్యార్థులు, 245 మంది ఎస్టీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు వివరించారు.

### సబ్సిడీ పథకాల అమలు

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీపై 89 ఈవీ ద్విచక్ర వాహనాలు, 70 శాతం సబ్సిడీపై 46 త్రిచక్ర వాహనాలు, 100 శాతం సబ్సిడీపై 10 సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ యూనిట్లు, 80 శాతం సబ్సిడీపై ఒక్కొక్కరికి రెండు గేదెల చొప్పున 49 యూనిట్లు అందించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఎస్టీ ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 61 మందికి రూ.17.82 లక్షలు, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 871 మందికి రూ.2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో 2,315 మంది ఎస్సీలకు, 436 మంది ఎస్టీలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. టీ–ప్రైడ్ కింద గత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీలకు 233 యూనిట్లకు రూ.6.90 కోట్లు, ఎస్టీలకు 76 యూనిట్లకు రూ.2.66 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కులాంతర వివాహాలు చేసుకున్న 44 జంటలకు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున మొత్తం రూ.1.10 కోట్లు బడ్జెట్ మంజూరైనట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి 5 పనులు రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టినట్లు అధికారులు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నాగేష్, డీఆర్వో జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కేవిఎస్‌బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సంగీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు, వివిధ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జీవనమే సందేశం.. బోయినపల్లి ప్రస్థానం

## నిలువెత్తు గాంధేయ జీవనం... బోయినపల్లి స్మరణం

### నేడు బోయినపల్లి వెంకట రామారావు జయంతి

సమాజ హితమే ఊపిరిగా.. ప్రజాసేవే పరమావధిగా.. సత్యం, అహింస, సమానత్వం, సామాజిక సంస్కరణలను జీవితాంతం ఆచరించిన మహోన్నత చైతన్యమూర్తి బోయినపల్లి వెంకట రామారావు. 'తోటపల్లి గాంధీ', 'కరీంనగర్ గాంధీ', 'తెలంగాణ గాంధీ'గా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఆయన జీవితం ఓ వ్యక్తి చరిత్ర మాత్రమే కాదు.. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, ఉద్యమ ప్రస్థానానికి నిలువెత్తు సాక్ష్యం. 1920 సెప్టెంబర్ 2న ఉమ్మడి కరీంనగర్ జిల్లా తోటపల్లి గ్రామంలో రంగమ్మ, కొండల్‌రావు దంపతులకు జన్మించిన వెంకట రామారావు.. 2014 అక్టోబర్ 27న 94వ ఏట కన్నుమూసే వరకు ప్రజాసేవే జీవితంగా గడిపారు. హైదరాబాద్ సంస్థాన విమోచన పోరాటం నుంచి గ్రంథాలయోద్యమం వరకు.. అస్పృశ్యతా నివారణ నుంచి భూదానోద్యమం వరకు.. ఖాదీ వికాసం నుంచి సాహిత్య, సాంస్కృతిక పునరుజ్జీవనం వరకు ఆయన అడుగుపెట్టని ప్రజాహిత రంగం లేదంటే అతిశయోక్తి కాదు. బాల్యంలోనే నిజాం పాలనలోని వెట్టిచాకిరీ, కుల వివక్ష, మూఢాచారాలు, మాతృభాషపై ఆంక్షలు వెంకట రామారావును కలచివేశాయి. ఆర్యసమాజ సంస్కరణ భావజాలం, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి ఆయన ఆలోచనలకు పదును పెట్టాయి. పదహారేళ్ల ప్రాయంలోనే ప్రజాసేవకు అంకితమయ్యారు. 1935 డిసెంబర్ 29 నుంచి 1936 జనవరి 1 వరకు సిరిసిల్లలో జరిగిన నాలుగో ఆంధ్ర మహాసభలో స్వచ్ఛంద దళ నాయకుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆంధ్ర మహాసభను కేవలం సమావేశ వేదికగా కాకుండా ప్రజల్లో భాషా చైతన్యం, స్వేచ్ఛాకాంక్షను రగిలించే ఉద్యమ వేదికగా భావించారు. మూఢనమ్మకాలు, కుల జాడ్యాలు సమాజాన్ని పట్టిపీడిస్తున్న కాలంలోనే వెంకట రామారావు సంస్కరణల బాట పట్టారు. 1940లో చిల్వాకోడూరు కేంద్రంగా మొదలుపెట్టి జగిత్యాల, కోరుట్ల ప్రాంతాల్లో వితంతు పునర్వివాహాలకు ముందుండి సహకరించారు. ఛాందసవాదుల నుంచి బెదిరింపులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. 1945 నాటికే దళితుల ఆలయ ప్రవేశానికి కృషి చేయడంతో పాటు వారితో సహపంక్తి భోజనాలు నిర్వహించారు. అట్టడుగు వర్గాలకు ఆత్మగౌరవం, విద్యావకాశాలు కల్పించినప్పుడే స్వాతంత్ర్యానికి సార్థకత చేకూరుతుందని తన ఆచరణతో చాటిచెప్పారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ పిలుపుతో వెంకట రామారావు స్వాతంత్ర్య పోరాటంలో మరింత క్రియాశీలమయ్యారు. నిజాం పోలీసుల నిఘా, కుటుంబంపై ఒత్తిళ్లు ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. తండ్రి కొండల్‌రావును మాలీ పటేల్ పదవి నుంచి తొలగించి నిర్బంధించినా ఆయన వెరవలేదు. అజ్ఞాతంలో ఉంటూనే మెట్‌పల్లి ఖాదీ కేంద్రంపై నిజాం ఆంక్షలను ధిక్కరించి మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జమ్మికుంట రైల్వే మార్గానికి సంబంధించిన ఉద్యమ కేసులో అరెస్టై దాదాపు రెండేళ్లు కారాగార శిక్ష అనుభవించారు. 1945లో కాజీపేట సమీపంలో మహాత్మా గాంధీని ప్రత్యక్షంగా దర్శించడం వెంకట రామారావు జీవితంలో కీలక ఘట్టం. గాంధీజీతో సంభాషణ అనంతరం ఆయన జీవన విధానం మరింత గాంధేయ మార్గంలోకి మళ్లింది. ఖాదీ ధారణ, నిరాడంబర జీవనం, మద్యపాన నిషేధం, అహింసాయుత పోరాటాన్ని జీవితాంతం పాటించారు. 1948 జనవరి 30న గాంధీజీ హత్య వార్త తెలిసినప్పుడు జైలులోనే సంతాప సభ నిర్వహించి బాపూజీకి నివాళులర్పించారు. గాంధీని కేవలం అభిమానించడమే కాదు.. ఆయన ఆశయాలను తన జీవితంలో ఆచరించి చూపారు. వెంకట రామారావు జీవితంలో గ్రంథాలయోద్యమానికి ప్రత్యేక స్థానం ఉంది. 'గ్రంథాలయం పుస్తకాల కొట్టు కాదు.. ప్రజా చైతన్య వికాసానికి ప్రయోగశాల' అని బలంగా విశ్వసించారు. 1939లో తన 19వ ఏటనే 'ఆంధ్ర విద్యాభివర్ధిని' గ్రంథాలయాన్ని స్థాపించారు. 1972 నుంచి 1978 వరకు కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సేవలందించారు. సుదీర్ఘకాలం పాలకమండలిలో కొనసాగుతూ ఊరూరా గ్రంథాలయాలు, సంచార పుస్తక కేంద్రాలు, వయోజన రాత్రి బడుల ఏర్పాటుకు కృషి చేశారు. 1976లో స్వయంగా స్థలం సమకూర్చి కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించేందుకు చొరవ చూపారు. అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, కోదాటి నారాయణరావు వంటి ప్రముఖులతో కలిసి పఠనోద్యమానికి ఊపిరిపోశారు. 1962లో 'కరీంనగర్ జిల్లా రచయితల సంఘం' స్థాపనలో కీలకపాత్ర పోషించిన వెంకట రామారావు.. అనంతరం 'సారస్వత జ్యోతి' సంస్థను ఏర్పాటు చేశారు. విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వేంకటావధాని, వానమామలై వరదాచార్యులు, పల్లా దుర్గయ్య, దాశరథి కృష్ణమాచార్య, సి.నారాయణరెడ్డి, గుంటూరు శేషేంద్రశర్మ, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు వంటి ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. చరిత్ర పరిశోధకులు బీఎన్ శాస్త్రి, దూపాటి వేంకట రమణాచార్యులతో కలిసి శాతవాహనులు, కాకతీయుల కాలానికి చెందిన శాసనాలు, తాళపత్రాలు, పురాతన నాణేలు, ఇతర చారిత్రక ఆనవాళ్ల సేకరణకు కృషి చేశారు. స్వయంగా కవి అయిన ఆయన 'వెంకట రామారావు గేయాలు' వంటి రచనల ద్వారా ప్రజా చైతన్యాన్ని అక్షరబద్ధం చేశారు. సర్వోదయ ఆదర్శాలను జీవన విధానంగా మార్చుకున్న వెంకట రామారావు.. ఆచార్య వినోబా భావే, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌లతో కలిసి పర్యటించారు. భూదానోద్యమంలో తనకున్న ఏడు ఎకరాల సారవంతమైన భూమిని నిరుపేదలకు దానం చేసి.. 'చెప్పడం కాదు.. చేసి చూపడమే త్యాగం' అని నిరూపించారు. 1981లో 'ఖాదీ నవనిర్మాణ సమితి'ని నెలకొల్పి గ్రామీణ చేతివృత్తుల పరిరక్షణకు కృషి చేశారు. అఖిల భారత సర్వసేవా సంఘం సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి అధ్యక్షుడిగా, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం ప్రతినిధిగా గాంధేయ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమంలోనూ ఆయన ముందుండేవారు. వృద్ధాప్యంలోనూ తన సిద్ధాంతాల విషయంలో రాజీపడకుండా సత్యాగ్రహ దీక్షలకు దిగిన నిబద్ధత ఆయన సొంతం. ఆయన సేవలకు గుర్తింపుగా 'గ్రంథాలయ విభూషణ్', 'ఉపన్యాస కేసరి', 'హరిజన బంధు', 'విశ్వబంధు', 'అపర గాంధీ' వంటి బిరుదులు వరించాయి. 2005లో కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 2014 అక్టోబర్ 27న బోయినపల్లి వెంకట రామారావు భౌతికంగా దూరమైనా.. ఆయన వెలిగించిన అక్షరజ్యోతి, గాంధేయ నిబద్ధత, త్యాగనిరతి నేటికీ వెలుగులు పంచుతూనే ఉన్నాయి. స్వాతంత్ర్యమంటే పరాయి పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు.. అజ్ఞానం, అస్పృశ్యత, పేదరికం, అసమానతలు లేని సమాజ నిర్మాణమని తన జీవితంతో చాటిన బోయినపల్లి వెంకట రామారావు.. నిజంగానే 'జీవనమే సందేశం'గా నిలిచిన తెలంగాణ గాంధీ.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కల్పవృక్షం కలకాలం జీవనాధారం

## నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం



ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం నిర్వహిస్తారు. జీవన వృక్షం అని ప్రసిద్ధి చెందిన కొబ్బరి చెట్టు ప్రాధాన్యతను చాటడం, దాని ఆధారంగా జీవనోపాధి సాగిస్తున్న కోట్లాది మంది రైతుల కృషిని గుర్తించడం, పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడడం ఈ దినోత్సవం వెనుక ప్రధాన ఉద్దేశ్యం. ఆసియా పసిఫిక్ కొబ్బరి సమాజం అనే అంతర్జాతీయ సంస్థ 1999లో స్థాపించ బడింది. దీనిని పురస్కరించుకుని 2009లో మొదటి.సారిగా ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపు కున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ 2న దీన్ని గుర్తుగా పాటిస్తున్నారు. ఈ సంస్థలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన 18 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. కొబ్బరి పంట ఉత్పత్తి, వినియోగం, అంతర్జాతీయ మార్కెట్ విస్తరణ, రైతుల ఆదాయాభివృద్ధి లక్ష్యాలతో ఈ వేదిక ఏర్పడింది.



కొబ్బరి చెట్టును కల్పవృక్షం అని పిలవడానికి కారణం దాని ప్రతి భాగం ఉపయోగకరమై ఉండడమే. వేర్లు, కాండం, ఆకులు, పండు అన్నీ మానవ జీవితానికి ఉపయోగ పడతాయి. కొబ్బరి నీరు సహజమైన ఎలక్ట్రోలైట్‌లకు నిలయం. 100 మిల్లీ లీటర్ల కొబ్బరి నీటిలో సుమారు 19 క్యాలరీలు, 4 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 250 మిల్లీ గ్రాముల పొటాషియం, 25 మిల్లీ గ్రాముల సోడియం ఉంటాయి. క్రీడాకారులకు, శ్రమతో జీవించే వారికి ఇది సహజ శక్తినిస్తుంది. కొబ్బరి నూనెలో 90 శాతం మధ్యస్థ శృంఖల కొవ్వు ఆమ్లాలు (వీజుం) ఉంటాయి. వీటిలో లౌరిక్ ఆమ్లం శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కొబ్బరి పాలు విటమిన్ సి, ఇ, బి కంప్లెక్స్, ఇనుము, మగ్నీషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలతో నిండిపోయి ఉంటాయి. కొబ్బరి తురుము మిఠాయిలు, వంటకాల్లో రుచిని పెంచడమే కాకుండా అధిక ఫైబర్‌తో జీర్ణక్రియకు తోడ్పడుతుంది.

కొబ్బరి చెట్టు ఆకులను గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పుల కోసం, చాపలు, ముట్టెలు తయారీకి ఉపయోగిస్తారు. పీచు నుండి తాడులు, గోనె సంచులు, పరుపులు, బ్రష్‌లు తయారవుతాయి. తాటి కాండంతో గృహోపకరణాలు, ఫర్నిచర్ తయారు చేస్తారు. చిప్పలను బయోమాస్ ఇంధనంగా వినియోగిస్తారు. కొబ్బరి చెట్టు వాణిజ్య, పారిశ్రామిక, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అమూల్యమైన వనరుగా నిలుస్తుంది.

ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి సుమారు 6.3 కోట్ల మెట్రిక్ టన్నుల కొబ్బరి ఉత్పత్తి అవుతుంది. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, భారతదేశం మూడు ప్రధాన ఉత్పత్తి దారులు. వీటి లోనే ప్రపంచ ఉత్పత్తిలో 70 శాతం వస్తుంది. భారత దేశం రెండవ అతిపెద్ద ఉత్పత్తిదారు. 2023 గణాంకాల ప్రకారం దేశంలో 21 లక్షల హెక్టార్లకు పైగా కొబ్బరి సాగు విస్తరించి ఉంది. సంవత్సరానికి సుమారు 1.9 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. కేరళ ఒక్కదానిలోనే దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వస్తుంది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, గోవా కూడా ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాలు. దేశ వ్యాప్తంగా సుమారు 20 కోట్ల ప్రజలు ప్రత్యక్ష, పరోక్షంగా కొబ్బరి ఆధారిత జీవనోపాధిపై ఆధారపడి ఉన్నారు.

కొబ్బరి ఉత్పత్తుల ద్వారా భారత దేశం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తోంది. కోయిర్ ఉత్పత్తులు, కొబ్బరి నూనె, ఎండు కొబ్బరి, కొబ్బరి నీటితో తయారైన పానీయాలు, హ్యాండ్‌క్రాఫ్ట్ ఎగుమతుల్లో ప్రధాన భాగం. కేవలం కోయిర్ ఉత్పత్తుల ద్వారానే 2022--23 ఆర్థిక సంవత్సరంలో సుమారు 4,340 కోట్ల రూపాయల ఎగుమతులు జరిగాయి. ఈ పరిశ్రమలో లక్షలాది మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.

అయితే కొబ్బరి పరిశ్రమకు సవాళ్లు తక్కువ కావు. దేశ వ్యాప్తంగా పంటలో 30శాతం చెట్లు వయసు పైబడినవే. దిగుబడి తగ్గిపోవడం సహజం. కొత్తగా నాటే మొక్కలకు ప్రోత్సాహక పథకాలు అవసరం. కొబ్బరి చెట్లకు రూట్ విల్ట్, బ్లాక్ హెడ్, కీటకాల దాడి వంటి వ్యాధులు ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తాయి. మార్కెటింగ్ సౌకర్యాల లేమి, శ్రామికుల కొరత సమస్యలలో ముఖ్యమైనవి. ఒక చెట్టుపైకి ఎక్కి కాయలు కోయగల నైపుణ్యం కలిగిన శ్రామికులు రోజురోజుకూ తగ్గిపోతున్నారు. దీంతో రైతులు అధిక ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం ఈ సమస్యలను గుర్తించడానికి, వాటి పరిష్కార మార్గాలను చర్చించడానికి ఒక మంచి వేదిక. ప్రతి సంవత్సరం ప్రత్యేకమైన థీమ్ ప్రకటించి రైతుల ఆదాయాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులు, సాంకేతికత వినియోగం, మార్కెట్ విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. కొబ్బరి పరిశ్రమ భవిష్యత్తు స్థిరంగా ఉండాలంటే పంట సంరక్షణ, నూతన ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు రైతులకు ఆర్థిక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు. ఇది జీవనానికి, ఆర్థికాభివృద్ధికి, ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. కోట్లాది మంది రైతుల కష్టానికి గౌరవం ఇవ్వడం, ఈ వనరును భావి తరాలకు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రకృతి మనకు ప్రసాదించిన ఈ కల్ప వృక్షాన్ని కాపాడుకోవడం ద్వారానే గ్రామీణాభివృద్ధి, స్థిరమైన జీవన విధానం సాధ్యమవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జన హృదయ నేత వైఎస్

## నేడు రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ప్రజా నాయకుడు, ఆంధ్రప్రదేశ్ 16వ ముఖ్యమంత్రి డాక్టర్ యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (వైఎస్సార్) వర్ధంతి సందర్భంగా నేడు (సెప్టెంబర్ 2) ఆయన సేవలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు స్మరించుకుంటున్నారు. 1949 జూలై 8న జమ్మలమడుగులోని సీఎస్ఐ కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జయమ్మ, రాజారెడ్డి దంపతులకు జన్మించిన వైఎస్సార్, బళ్ళారిలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో ప్రాథమిక విద్యను, విజయవాడ లయోలా కళాశాలలో ఉన్నత విద్యను పూర్తి చేశారు. గుల్బర్గా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్ పట్టా పొంది, తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ కళాశాలలో హౌస్ సర్జన్ చేశారు. గుల్బర్గా ఎంఆర్ఎం వైద్య కళాశాలతో పాటు ఎస్వీఆర్ఆర్‌లోనూ విద్యార్థి/హౌస్ సర్జన్ సంఘాల అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు చాటారు. ఆ తర్వాత జమ్మలమడుగు సీఎస్ఐ ఆసుపత్రిలో వైద్యాధికారిగా,



పులివెందులలో తన తండ్రి పేరిట నిర్మించిన 70 పడకల ఆసుపత్రిలో డాక్టర్‌గా సేవలు అందించారు. వీరి కుటుంబం పులివెందులలో నెలకొల్పిన కళాశాలలను లయోలా సంస్థలకు అప్పగించగా, సింహాద్రిపురంలోని కళాశాలను ఇప్పటికీ వారి కుటుంబమే నిర్వహిస్తోంది.

1978లో పులివెందుల నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వైఎస్సార్, అక్కడ నుంచి 6 సార్లు శాసనసభ్యుడిగా మరియు కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎంపీగా విజయం సాధించి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఓటమనేదే ఎరుగని నేతగా నిలిచారు. 1980-83 కాలంలోనే గ్రామీణాభివృద్ధి, వైద్యం, విద్యా, ఎక్సైజ్ శాఖల మంత్రిగా పనిచేశారు. 1983-85 మరియు 1998-2000 మధ్య రెండు పర్యాయాలు ఏపీసీసీ అధ్యక్షుడిగా సేవలు అందించారు. కాంగ్రెస్ పార్టీలో మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి వంటి సీనియర్లతో విభేదిస్తూ నిత్య అసమ్మతివాదిగా పేరుపొందిన ఆయన, సొంత పార్టీ నేతలపై రాజకీయ పోరాటాలు సాగించారు. నాడు నగరంలో జరిగిన అల్లర్లలో వైఎస్సార్ వర్గం పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చినప్పటికీ, తదనంతర కాలంలో తాను ముఖ్యమంత్రి అయ్యేనాటికి పార్టీలో ఎలాంటి శిబిరాలు లేకుండా సర్వహక్కులు సాధించుకోగలిగారు. 1999 నుంచి 2004 వరకు ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన ఆయన, 2003 వేసవిలో చేపట్టిన 1,467 కిలోమీటర్ల చారిత్రాత్మక పాదయాత్ర ద్వారా ప్రజల్లో అపారమైన జనాదరణ పొంది మునిగిపోతున్న కాంగ్రెస్ నావను ఒడ్డుకు చేర్చారు.

2004 మేలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి తొలిసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించిన వైఎస్సార్, తన పాదయాత్ర హామీ మేరకు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైలుపైనే తొలి సంతకం చేశారు. జలయజ్ఞం కింద పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతం చేయడంతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేశారు. క్రైస్తవ విశ్వాసాలు పాటిస్తూనే బెత్లహేమ్ యాత్రలు చేసిన ఆయన, పరంపరగా వస్తున్న హిందూ సంప్రదాయాలను వీడకుండా తిరుమల శ్రీవెంకటేశ్వర



స్వామిని అనేకమార్లు దర్శించుకునేవారు. 2009 ఎన్నికల్లో శాసనసభలో 156 స్థానాలు, లోక్‌సభలో 33 స్థానాలు సాధించి కాంగ్రెస్‌ను ఒంటిచేత్తో గెలిపించి వం-సగా రెండోసారి సీఎం అయ్యారు. అయితే, 2009 సెప్టెంబర్ 2న చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తుండగా ఉదయం 9:35 గంటలకు హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోగా, నల్లమల అడవుల్లో సంభవించిన ప్రమాదంలో ఆయనతో పాటు ఐదుగురు మరణించారు. ఆయన మరణవార్తను తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 67 మంది గుండె ఆగి మరియు ఆత్మహత్యల వల్ల ప్రాణాలు కోల్పోవడం ఆయన పట్ల ప్రజలకున్న అభిమానానికి నిదర్శనం. భౌతికంగా దూరమైనా ఆయన అందించిన పాలన, సంక్షేమ పథకాలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# పాక్ క్రికెట్‌లో ముసలం!

## సెలెక్టర్ పదవికి మిస్బా రాజీనామా

## సీనియర్ల వేటుపై తీవ్ర అసంతృప్తి

## ఏడుగురు ఆటగాళ్లను ఇంటికి పంపిన పీసీబీ

## కోచ్ సర్ఫరాజ్, ఉమర్ గుల్‌పైనా వేటు

## ఇంగ్లండ్ చేతిలో సిరీస్ కోల్పోయిన పాక్

**లండన్:** అనిశ్చితికి మారుపేరుగా నిలిచే పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి ముసలం మొదలైంది. ఇంగ్లండ్ పర్యటనలో వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న కఠిన నిర్ణయాలు జట్టులో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సిరీస్ మధ్యలోనే సీనియర్ ఆటగాళ్లను స్వదేశానికి పంపడంతో పాటు కోచింగ్ బృందంపైనా వేటు వేయడాన్ని నిరసిస్తూ సెలెక్టర్ మిస్బావుల్ హక్ తన పదవికి రాజీనామా చేశాడు. లార్డ్స్ టెస్టులో పాకిస్థాన్ ఘోర పరాజయం తర్వాత పీసీబీ ప్రక్షాళనకు దిగింది. జట్టులోని ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపాలని నిర్ణయించింది. అంతటితో ఆగకుండా కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను బాధ్యతల నుంచి తప్పించి.. మూడో టెస్టుకు వైట్‌బాల్ కోచ్ మైక్ హెసన్‌కు బాధ్యతలు అప్పగించింది. బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌పైనా వేటు వేసింది. తాము ఎంపిక చేసిన జట్టులోని ఆటగాళ్లను సిరీస్ మధ్యలోనే తొలగించడం, కోచింగ్ బృందాన్ని మార్చడంపై మిస్బా తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. బోర్డు నిర్ణయాలతో మనస్తాపం చెందిన అతడు మంగళవారం సెలెక్టర్ పదవికి హఠాత్తుగా రాజీనామా చేశాడు. అయితే మిస్బా రాజీనామాను పీసీబీ ఇంకా ఆమోదించాల్సి ఉంది. నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కోచ్ బాధ్యతల నుంచి కూడా అతడు తప్పుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. లార్డ్స్ టెస్టు పరాజయం తర్వాత మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవైస్ జఫార్, ఖుర్రం షెహజాద్‌లను జట్టు నుంచి తప్పించినట్లు సమాచారం. వీరి స్థానంలో సయీం అయూబ్‌తో పాటు అరాఫత్ మిన్హాస్, మహ్మద్ ఇమ్రాన్, సాద్ బైగ్, ఇమ్రాన్ రంధవా, రజుల్లాహ్ తదితర యువ ఆటగాళ్లకు చివరి టెస్టులో అవకాశం కల్పించనున్నారు. హెడింగ్లేలో తొలి టెస్టును సొంతం చేసుకున్న ఇంగ్లండ్.. లార్డ్స్‌లోనూ జోరు కొనసాగించింది. 389 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ బ్యాటింగ్ మరోసారి కుప్పకూలింది. షాద్ షకీల్ 97 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. ఓలీ రాబిన్సన్ (4-24), జోష్ టంగ్ (3-46), జోఫ్రా ఆర్చర్ (2-73) విజృంభించడంతో ఇంగ్లండ్ 194 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ సిరీస్‌ను కైవసం చేసుకోగా.. పాకిస్థాన్‌కు మూడో టెస్టు నామమాత్రంగా మారింది. చివరి టెస్టు సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్‌లో జరగనుంది. ఓవైపు వరుస ఓటములు.. మరోవైపు సీనియర్లపై వేటు.. ఇప్పుడు సెలెక్టర్ మిస్బా రాజీనామా.. వెరసి పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి సంక్షోభ మేఘాలు కమ్ముకున్నాయి.

# టెన్నిస్ కోర్టే ఫ్యాషన్ ర్యాంప్!

- బాస్కెట్‌బాల్ దిగ్గజం లుక్‌లో ఒసాకా
- అలెన్ ఐవెర్సన్‌కు స్టయిల్‌తో నివాళి
- యూఎస్ ఓపెన్‌లో మరోసారి ప్రత్యేక ఆకర్షణ
- ఆటతో పాటు ఫ్యాషన్‌లోనూ తనదైన ముద్ర
- తొలి రౌండ్‌లో గెలిచి ముందంజ



**న్యూయార్క్:** టెన్నిస్ కోర్టులో ఆటతో ప్రత్యర్థులను హడలెత్తించడమే కాదు.. తన ఫ్యాషన్‌తో ప్రేక్షకులను అబ్బురపరచడం జపాన్ స్టార్ నవోమి ఒసాకాకు కొత్తేమీ కాదు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ వచ్చిందంటే చాలు.. ఏదో ఒక ప్రత్యేక థీమ్‌తో కోర్టులోకి అడుగుపెట్టి అందరి దృష్టినీ ఆకర్షిస్తుంటుంది. తాజాగా యూఎస్ ఓపెన్-2026లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. ఈసారి అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం అలెన్ ఐవెర్సన్‌ను గుర్తుచేసే లుక్‌తో వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్ కోసం ఒసాకా వినూత్న వేషధారణతో కోర్టులోకి వచ్చింది. పొడవాటి తెల్లని స్కర్ట్, వదులుగా ఉన్న హుడీతో ప్రవేశించిన ఆమె.. ఆ తర్వాత వాటిని తొలగించి ఐవెర్సన్‌ను తలపించే స్టయిల్‌లో కనిపించింది. జుట్టును 'కార్న్‌రోస్' తరహాలో తీర్చిదిద్దుకోవడంతో ఆమె లుక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కోర్టులోకి వచ్చే ముందు ఐవెర్సన్ చిత్రం ముద్రించిన షర్ట్‌ను ధరించి అతడిపై తనకున్న అభిమానాన్ని చాటుకుంది. తన కొత్త లుక్‌పై ఒసాకా స్పందిస్తూ.. ఐవెర్సన్ ఆటతో పాటు అతడి ఫ్యాషన్ తనకు ఎంతో ఇష్టమని తెలిపింది. తనదైన స్టయిల్‌తో బాస్కెట్‌బాల్ ప్రపంచంలో ప్రత్యేక ముద్ర వేసిన ఐవెర్సన్.. క్రీడాకారుల దుస్తుల తీరుపైనా ప్రభావం చూపాడని పేర్కొంది. 'ఫ్యాషన్‌తోనూ మన వ్యక్తిత్వాన్ని చెప్పొచ్చు' అన్న భావనను ఒసాకా వ్యక్తం చేసింది. తనను అనుకరిస్తూ ప్రత్యేక లుక్‌లో కోర్టులోకి వచ్చిన ఒసాకాపై ఐవెర్సన్ కూడా ప్రశంసలు కురిపించాడు. తనకు దక్కిన గొప్ప గౌరవంగా దీనిని అభివర్ణిస్తూ ఆమెను ప్రత్యక్షంగా చూసేందుకు ఎదురుచూస్తున్నట్లు సందేశం పంపాడు. ఫ్యాషన్‌తోనే కాకుండా ఆటలోనూ ఒసాకా ఆకట్టుకుంది. తొలి రౌండ్‌లో జఖరోవాపై విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. విభిన్న వేషధారణతో గ్రాండ్‌స్లామ్‌లలో సందడి చేయడం ఒసాకాకు అలవాటే. గత యూఎస్ ఓపెన్‌లో 'లబుబు' బొమ్మలతో ప్రత్యేకంగా కనిపించి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఆక్వా బ్లూ రంగు జాకెట్, వెడల్పాటి తెల్లని ప్యాంట్, తెల్లటి ముసుగు, టోపీ, చేతిలో గొడుగుతో ఫ్యాషన్ సుందరిలా కోర్టులోకి అడుగుపెట్టి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. రాకెట్‌తో ఆటలో తనదైన ముద్ర.. వేషధారణతో ఫ్యాషన్‌లో ప్రత్యేక ముద్ర.. రెండింటినీ కలిపి టెన్నిస్ కోర్టునే ఫ్యాషన్ వేదికగా మార్చేస్తోంది నవోమి ఒసాకా.

# పాటిదార్‌పై ఇషాన్ పైచేయి!

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్‌జోన్
- 4 వికెట్ల తేడాతో సెమీస్‌లో గెలుపు
- వైభవ్, ఇషాన్ మెరుపు బ్యాటింగ్
- ఏడు వికెట్లతో ముకేశ్ కుమార్ సత్తా
- దూబే తిప్పేసినా తప్పని ఓటమి



**బెంగళూరు:** దేశవాళీ సీజన్‌లో ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీలో ఈస్ట్‌జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇషాన్ కిషన్ సేన సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (40), కెప్టెన్ ఇషాన్ కిషన్ (39) బ్యాట్‌తో మెరవగా.. ముకేశ్ కుమార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లతో విజయంలో కీలకపాత్ర పోషించాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన సెమీఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో రింకూ సింగ్ (60) అర్ధశతకంతో రాణించినా ప్రత్యర్థి జట్టు 266 పరుగులకే ఆలౌటైంది. అనంతరం హర్ష్ దూబే (4-66), ఆర్యన్ పాండే (3-43) బంతితో విజృంభించడంతో ఈస్ట్‌జోన్ కూడా సరిగ్గా 266 పరుగులకే కుప్పకూలింది. దీంతో తొలి ఇన్నింగ్స్ ముగిసేసరికి రెండు జట్లు సమానంగా నిలిచాయి.

### ముకేశ్ దెబ్బకు 158కే కుప్పకూలి..

రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించి ఈస్ట్‌జోన్‌కు సవాల్ విసరాలని భావించిన ప్రత్యర్థి జట్టుకు ముకేశ్ కుమార్, అభిజిత్ సర్కార్ షాకిచ్చారు. వీరిద్దరి ధాటికి బ్యాటింగ్ లైనప్ నిలవలేక 158 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఈస్ట్‌జోన్ ముందు 159 పరుగుల లక్ష్యం నిలిచింది.

### వైభవ్ ధనాధన్.. ఇషాన్ దంచుడు

స్వల్ప లక్ష్య ఛేదనలో ఈస్ట్‌జోన్ ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (24), వైభవ్ సూర్యవంశీ (40) దూకుడుగా ఆడి శుభారంభం అందించారు. ముఖ్యంగా వైభవ్ వేగంగా పరుగులు రాబట్టి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. అయితే హర్ష్ దూబే మరోసారి బంతితో చెలరేగి 53 పరుగులకు నాలుగు వికెట్లు పడగొట్టడంతో ఈస్ట్‌జోన్ కాస్త తడబడింది. అయితే గాయం కారణంగా రెండో రోజు ఆటకు దూరమైన కెప్టెన్ ఇషాన్ కిషన్ కీలక సమయంలో బాధ్యత తీసుకున్నాడు. 39 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయానికి చేరువ చేశాడు. చివర్లో మహమ్మద్ షమీ విన్నింగ్ షాట్ కొట్టడంతో ఈస్ట్‌జోన్ నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుని ఫైనల్లో అడుగుపెట్టింది. దూబే రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బంతితో పోరాడినా.. వైభవ్ దూకుడు, ఇషాన్ కీలక ఇన్నింగ్స్, ముకేశ్ కుమార్ బౌలింగ్ జోరుతో ఈస్ట్‌జోన్ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది.



# అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగాలి

## అదే నా లక్ష్యం: గుర్నూర్ బ్రార్

**బెంగళూరు:** మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటగల పేసర్‌గా ఎదగడమే తన ప్రధాన లక్ష్యమని భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ తెలిపాడు. సీనియర్ పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలతో కలిసి బౌలింగ్ చేయడం తనకు ఎంతో ఉపయోగపడిందని చెప్పాడు. ముఖ్యంగా బంతిని సరైన లెంగ్త్‌లో వేయడంలో స్థిరత్వం సాధించేందుకు వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు పేర్కొన్నాడు. ఇప్పటివరకు భారత్ తరఫున ఆరు వన్డేలు ఆడిన గుర్నూర్ 6.96 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టి అంతర్జాతీయ కెరీర్‌కు మంచి ఆరంభం ఇచ్చాడు. రంజీ ట్రోఫీ, ఇండియా 'ఎ' తరఫున కనబరిచిన ప్రదర్శనతోనే భారత జట్టులో అవకాశం దక్కిందని తెలిపాడు. "బౌలింగ్‌లో లెంగ్త్‌ను నిలకడగా కొనసాగించడం, పిచ్ పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో బ్యాటర్‌కు ఎలా బౌలింగ్ చేయాలన్న అంశాలపై మరింత అవగాహన పెంచుకుంటున్నా. ఎన్ని ఓవర్లు వేసినా శరీరంపై ఎక్కువ ప్రభావం పడకుండా ఫిట్‌నెస్‌ను తీర్చిదిద్దుకోవాలన్నది మొదటి నుంచీ నా లక్ష్యం" అని గుర్నూర్ చెప్పాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇచ్చిన సలహాలతో తన బౌలింగ్‌లో గణనీయమైన మార్పు వచ్చిందన్నాడు. "బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణల బౌలింగ్‌ను దగ్గరగా పరిశీలించా. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. వారిలాగే అన్ని ఫార్మాట్లలో రాణించే పేసర్‌గా ఎదగడానికి ప్రయత్నిస్తున్నా" అని పేర్కొన్నాడు. ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న గుర్నూర్ బ్రార్.. సౌత్‌జోన్‌తో జరిగిన సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి మరోసారి తన సత్తా చాటాడు.

# ఆఫ్ఘన్‌తో టీ20 పోరుకు టీమిండియా రెడీ

- కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్
- వైస్ కెప్టెన్‌గా తిలక్ వర్మ
- వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు
- బుమ్రా పునరాగమనం
- సెప్టెంబర్ 13 నుంచి మూడు మ్యాచ్‌ల సిరీస్



**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును పురుషుల సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ సిరీస్‌లో టీమిండియాకు శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం వహించనుండగా.. హైదరాబాదీ యువ బ్యాటర్ తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జట్టులో సీనియర్లతో పాటు యువ ఆటగాళ్లకు సెలక్టర్లు ప్రాధాన్యం ఇచ్చారు. బ్యాటింగ్ విభాగంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ కూడా జట్టులో చోటు సంపాదించారు. సంజూ, ఇషాన్ వికెట్ కీపర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆల్‌రౌండర్ల కోటాలో శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు అవకాశం లభించింది. స్పిన్ బాధ్యతలను వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ పంచుకోనున్నారు.

### బుమ్రా పునరాగమనం

పేస్ విభాగంలో స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అతడితో పాటు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా పేస్ బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాల ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఉంటుందని సెలక్షన్ కమిటీ తెలిపింది.

### సెప్టెంబర్ 13 నుంచి సమరం

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో 3 టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. యువ ఆటగాళ్లకు అవకాశమిస్తూ, అనుభవజ్ఞులను జోడించి ఎంపిక చేసిన భారత జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో పోరుకు సిద్ధమవుతోంది. భారత జట్టు: శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.




# నవంబర్ 27న మైసా విడుదల


## రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.

# మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్



'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బెత్లెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.




# కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్, పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.




# టాక్సిక్‌కు హాఫ్ స్టార్ రేటింగ్

### లెటర్ బాక్స్‌లో మహేశ్ బాబు తనయుడు గౌతమ్

### టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుమారుడు గౌతమ్ ప్రముఖ సోషల్ మీడియా రేటింగ్ యాప్

లెటర్‌బాక్స్ ద్వారా ఇచ్చిన సినిమా రేటింగ్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' సినిమాకు గౌతమ్ కేవలం హాఫ్ స్టార్ (0.5) ఇవ్వడం, అలాగే తన తండ్రి మహేష్ బాబు సినిమాలకే కాకుండా ఇతర స్టార్ హీరోల చిత్రాలకు ఇచ్చిన రేటింగ్‌లు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గౌతమ్ లెటర్‌బాక్స్ ప్రొఫైల్ ప్రకారం.. అతను ఇప్పటివరకు వివిధ భాషలు మరియు జోనర్లకు చెందిన 400లకు పైగా సినిమాలను వీక్షించినట్లు తెలుస్తోంది. అయితే ఇతరులతో సంబంధం లేకుండా, సినిమాల కంటెంట్‌ను బట్టి స్వతంత్రంగా రేటింగ్‌లు ఇవ్వడం ఈ డిబేట్‌కు ప్రధాన కారణమైంది. తన తండ్రి మహేష్ బాబు నటించిన కల్ట్ క్లాసిక్స్ 'పోకిరి', '1: నేనొక్కడినే' సినిమాలకు గౌతమ్ 5 నక్షత్రాల రేటింగ్ ఇవ్వగా, 'బ్రహ్మోత్సవం' చిత్రానికి కేవలం 1 స్టార్ మాత్రమే ఇచ్చాడు. అలాగే 'నిజం', 'వంశీ' చిత్రాలకు 2 చొప్పున రేటింగ్ ఇచ్చాడు. కేవలం టాలీవుడ్ మాత్రమే కాకుండా పాన్-ఇండియా, హాలీవుడ్ సినిమాలపై కూడా గౌతమ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'బాహుబలి 2' చిత్రానికి 5 స్టార్లు ఇవ్వగా, 'పెళ్లిచూపులు', 'సీతారామం' సినిమాలకు 4.5 రేటింగ్ ఇచ్చాడు. మరోవైపు, యశ్ 'టాక్సిక్' చిత్రంతో పాటు విజయ్ దేవరకొండ 'లైగర్' మూవీకి కూడా అర నక్షత్రం రేటింగ్ ఇవ్వడం విశేషం. ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి 2.5 రేటింగ్ ఇచ్చాడు. ఇక సినిమా కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, బంధుప్రీతికి తావు ఇవ్వకుండా సినిమాలోని కంటెంట్ ఆధారంగా నిజాయితీగా రేటింగ్‌లు ఇస్తున్నాడని కొందరు నెటిజన్లు గౌతమ్‌ను ప్రశంసిస్తుంటే, మరికొందరు సెలబ్రిటీ కుటుంబాల నుంచి ఇలాంటి బహిరంగ రేటింగ్‌లు రావడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల పిల్లలు అయినంత మాత్రాన వారి వ్యక్తిగత అభిప్రాయాలు, సినిమా రుచి ఇతరులలాగే ఉండటంలో తప్పులేదని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com